Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 163 మేడ్చల్ మల్కాజ్‌గిరి 4 జూలై 2023 మంగళవారం పేజీలు : 4

### వాతావరణ శాఖ గుడ్‌న్యూస్.. ఈ నెలంతా వానలే!

హైదరాబాద్: వానాకాలం ఇక జోరందుకోనుంది. రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో రాష్ట్రంలో వర్షపాతం ఆశించిన స్థాయిలో లేదు. నైరుతి రుతుపవనాల సీజన్ జూన్ 1వ తేదీ నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకు పరిగణిస్తారు. అయితే జూన్ నెలలో మూడు వారాల తర్వాత రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించడంతో వానలు ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వానలు జోరందుకున్నట్లు వాతావరణ శాఖ చెబుతోంది. ఈనెలలో సాధారణ వర్షపాతం 24.44 సెంటీమీటర్ల మేర నమోదు కావాల్సి ఉంది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల కదలికలు చురుకుగా ఉండటంతో ఈ నెలలో సాధారణంకంటే ఎక్కువగా వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. జూలై నెలకు సంబంధించి దేశవ్యాప్తంగా వర్షపాతం నమోదు అంచనాలను వాతావరణ శాఖ విడుదల చేసింది.



# కిషన్ రెడ్డి నో.... బండి నై...

## బీజేపీ బండెట్లా...?

హైదరాబాద్ : తెలంగాణా బీజేపీ బండిని ఎన్నికల వేళ జోరుగా పోనీయడం ఎలాగో బీజేపీ పెద్దలకు తెలియడంలేదు. కర్నాటక ఎన్నికల తరువాత తెలంగాణా బీజేపీ ఉసూరుమంటోంది. అదే టైంలో కాంగ్రెస్ లో సందడి పెరిగింది. మరి కొద్ది నెలలే ఎన్నికలకు టైం ఉంది. అయితే ఇంతలో పెద్ద మార్పులకు కేంద్ర పెద్దలు శ్రీకారం చుట్టాలనుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి.

అదే జరిగితే బీజేపీ ఎత్తిగిల్లుతుందా లేక ఇంకా ఇబ్బందులు పడుతుందా అన్నదే తెలియకుండా ఉంది అని అంటున్నారు. బండి సంజయ్ ని ప్రెసిడెంట్ పదవి నుంచి తప్పించి కేంద్ర మంత్రిని చేయాలని బీజేపీ ప్రతిపాదిస్తోంది. అది కాకుంటే బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఇవ్వాలనుకుంటోంది. ఈ రెండింటికీ బండి సంజయ్ అయితే నై అని అంటున్నారు అని తెలుస్తోంది. ఆయన తాను ప్రెసిడెంట్ గానే ఉంటాను ఆ పదవి తీసేస్తే జస్ట్ సామాన్య కార్యకర్తగా ఉంటాను అని అంటున్నట్లుగా చెబుతున్నారు. ఇదిలా ఉంటే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని తెలంగాణా బీజేపీ ప్రెసిడెంట్ పదవిలో కూర్చోబెట్టాలని బీజేపీ అనుకున్నా ఆయన సైతం నో చెబుతున్నారట. తనకు కేంద్ర మంత్రి పదవే ముద్దు అంటున్నారుట. దీంతో బీజేపీ పెద్దలకు ఏమీ పాలు పోవడంలేదుట.

ఇక ఆరెస్సెస్ సైతం బండిని ఈ కీలక టైంలో కదిలించడం వల్ల ఇబ్బందులే తప్ప మరేమీ కొత్తగా ఒనగూడేది ఉండదని అంటోందని టాక్. పైగా బండి మూడేళ్ళ ఏలుబడిలో బీజేపీని ఒక స్థాయికి తెచ్చారు అని ఆయన్ని కదిలిస్తే బీజేపీలో అసంతృప్తి పెరుగుతుందని అది కాస్తా ఎన్నికల వేళ సర్దుకోవడం కష్టంగా మారుతుంది అని అంటున్నారు. మరో వైపు చూస్తే బీజేపీలోకి వచ్చి చేరిన ఇతర పార్టీల నాయకులు అయిన ఈటెల రాజేందర్ డీకే అరుణ అలాగే రఘునందనరావులకు కీలకమైన పదవులు బీజేపీలో ఇవ్వాలని కూడా ఆలోచిస్తున్నారని తెలుస్తోంది. ఇక్కడ కీలకమైన పాయింట్ ఏంటి అంటే తెలంగాణా బీజేపీలో మార్పులు చేర్పులు చేద్దామని అనుకున్నా బీజేపీ ఏ ఒక్కటీ కలసి రావడంలేదు అలాగే సానుకూలం కావడంలేదు. దాంతో పాటు బీజేపీ ఇపుడున్న స్థితిని అధిగమించాలనుకుంటోంది. కానీ అలా చేయడం బిగ్ రిస్క్ అని ఆరెస్సెస్ అంటోంది. మొత్తానికి బీజేపీకి తెలంగాణాలో ఎలాంటి వ్యూహం అయితే లేకుండా పోయింది అని అంటున్నారు.

# జులై 8న వైఎస్ విజయమ్మ సోనియా భేటీ?



ఏపీ సీఎం జగన్కు భారీ షాక్ ఇవ్వడానికి సోనియా రాహుల్ గాంధీలు సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోంది. జులైన 8న వైఎస్ రాజశేఖర్ రెడ్డ జయంతి సందర్భంగా సోనియా రాహుల్ గాంధీలు కడపల జిల్లాలోని ఇడుపులపాయకు వచ్చి అక్కడి వైఎస్ఆర్ ఘాట్లో నివాళులు అర్పించనున్నారని సమాచారం. ఈ మేరకు ఇప్పటికే సోనియా వ్యక్తిగత భద్రతా సిబ్బంది ఇడుపులపాయకు వచ్చి భద్రత ఏర్పాట్లు పరిశీలించి వెళ్లారని.. సెక్యూరిటీ టీం క్లియరెన్స్ ఇస్తే సోనియా రాక ఖాయమని తెలుస్తోంది. రాజశేఖర్ రెడ్డి మరణం తరువాత కొద్ది రోజులకే సోనియా గాంధీ కుటుంబానికి వైఎస్ కుటుంబానికి పూర్తిగా చెడింది. ముఖ్యంగా జగన్ సోనియాను ఢీకొట్టి రాజకీయాల్లో ఎదురుతిరిగారు. ఏపీలో జగన్ సీఎం సీటులో కూర్చోగా కాంగ్రెస్ పార్టీ ఏపీలో పూర్తిగా కనుమరుగైంది. దేశంలో కూడా కాంగ్రెస్ బాగా బలహీనపడింది. అనంతరం కొద్దికాలానికి వైఎస్ కుమార్తె షర్మిల తన అన్న జగన్తో విభేదించడం తెలంగాణలో తాను ఒక రాజకీయ పార్టీని ఏర్పాటు చేయడం.. ఇప్పుడు ఆ పార్టీని కాంగ్రెస్లో విలీనం చేస్తారని చర్చ జరుగుతుండడం తెలిసిందే. వైఎస్ భార్య విజయమ్మ కూడా ప్రస్తుతం కుమారుడు జగన్ కంటే కుమార్తె షర్మిలతోనే రాజకీయంగా నడుస్తున్నారు. తెలంగాణలో షర్మిల నిర్వహించిన రాజకీయ కార్యక్రమాలలో పాల్గొనడమే కాకుండా షర్మిలకు మద్దతుగా కార్యక్రమం ఏర్పాటు చేసి రాజశేఖర్ రెడ్డి మిత్రులను ఆమే స్వయంగా పిలవడం తెలిసిందే. కుమారుడు జగన్ ఏపీలో సీఎంగా ఉన్నప్పటికీ విజయమ్మ ప్రస్తుతం తన రాజకీయ ప్రయాణాన్ని కుమార్తె షర్మిలతోనే కొనసాగిస్తున్నారు. మరోవైపు షర్మిల అడుగులు కాంగ్రెస్ వైపు పడుతున్నాయి. షర్మిల ఈ విషయాన్ని ఖండించినప్పటికీ కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ షర్మిల సోనియాల మధ్య రాయబారం చేస్తున్నారని రాజకీయ వర్గాలలో వినిపిస్తోంది. షర్మిలను కర్ణాటక నుంచి రాజ్యసభకు పంపిస్తారనీ వినిపిస్తోంది. మరోవైపు జగన్ పూర్తిగా బీజేపీకి అంటకాగుతున్నారు. ఈక్వేషన్లు ఇంతగా మారిన తరుణంలో సోనియా రాహుల్ గాంధీలు ఇడుపులపాయకు రావడమంటే ఏపీ కాంగ్రెస్లో భారీ స్పైక్ వచ్చినట్లే అనుకోవాలి. అంతేకాదు.. షర్మిల కోణంలో చూసినప్పుడు ఇడుపులపాయలో సోనియా గాంధీతో వైఎస్ విజయమ్మ భేటీ కూడా జరిగే అవకాశాలున్నట్లు రాజకీయవర్గాల నుంచి వినిపిస్తోంది.

# దేశానికి లైఫ్‌సైన్సెస్ క్యాపిటల్‌గా హైదరాబాద్: కేటీఆర్



హైదరాబాద్: సెమీ కండక్టర్ల రంగంలో హైదరాబాద్ నగరం అద్భుతంగా ముందుకెళ్తోందని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన యువత వల్ల నగరం అభివృద్ధి బాటలో నడుస్తోందని చెప్పారు. హైదరాబాద్ కోకాపేటలోని వన్ గోల్డెన్ మైల్‌లో మైక్రోచిప్ టెక్నాలజీ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెమీ కండక్టర్ డిజైన్, డెవలప్‌మెంట్ ఫెసిలిటీని కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. " నాస్కామ్ లెక్కల ప్రకారం దేశంలో 1/3 వంతు ఉద్యోగాలు హైదరాబాద్ నుంచే ఉన్నాయి.

బెంగళూరు, చెన్నై కంటే హైదరాబాద్ ముందంజలో ఉంది. దేశానికి లైఫ్ సైన్సెస్ క్యాపిటల్‌గా నగరం ఉంది.
భారత్‌లో వ్యాక్సిన్ ఉత్పత్తికి జీనోమ్ వ్యాలీ హెడ్‌క్వార్టర్స్. ప్రపంచంలోనే హైదరాబాద్ అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్" అని కేటీఆర్ అన్నారు.

# ఎన్నికలే లక్ష్యంగా కేసీఆర్ మరో సర్వే




# వణికిపోతున్న 25మంది గులాబీ ఎమ్మెల్యేలు!!

హైదరాబాద్ : కేసీఆర్ కొత్త సర్వే బలహీనంగా ఉన్న నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు టెన్షన్ పట్టుకుంది. ఎన్నికలే లక్ష్యంగా కేసీఆర్ నిర్వహించనున్న మరో సర్వేతో 25మంది ఎమ్మెల్యేలు వణికిపోతున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ వచ్చే ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో విజయం సాధించాలని ఇప్పటినుండే వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మరోమారు సర్వే నిర్వహిస్తున్నారు. 21 ప్రశ్నలతో ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నారు. ఒకపక్క ప్రతిపక్ష పార్టీలు గట్టి పోటీ ఇవ్వాలని పాదయాత్ర పేరుతో జోరుగా ప్రజాక్షేత్రంలోకి దూసుకు వెళుతుంటే కెసిఆర్ కూడా తానేమి తక్కువ కాదన్నట్టు ప్రతిపక్ష పార్టీల కంటే నాలుగు అడుగులు ముందే ఉండి క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సర్వేల రూపంలో తెప్పించుకుంటున్నారు.

**అసెంబ్లీ ఎన్నికల లక్ష్యంగా కేసీఆర్ మరో సర్వే ..21 ప్రశ్నలతో ప్రజాభిప్రాయం** : తాజాగా మరో మారు త్వరలో కేసీఆర్ కొత్త సర్వేను చేపడుతున్నట్టు పార్టీ వర్గాలలో చర్చ జరుగుతుంది. ఈసారి 21 ప్రశ్నలతో ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే సిట్టింగ్ లందరికీ దాదాపు టికెట్లు ఇస్తానని చెప్పిన కేసీఆర్, సిట్టింగ్ ఎమ్మెల్యేల పరిస్థితి ఏంటి? నియోజకవర్గంలో వారికి ఉన్న ప్రజా మద్దతు ఎంత? వారికి టికెట్ ఇస్తే విజయం సాధించే అవకాశం ఉందా? సొంత పార్టీలో ఆశవహులు ఎవరు? వారిలో ఎవరికి టికెట్ ఇస్తే బెనిఫిట్ ఉంటుంది? లేదా ప్రత్యర్థి పార్టీలో బలమైన నాయకులు ఎవరు? ఒకవేళ వారు ఎవరైనా గెలిచే అవకాశం ఉందా? అటువంటి వారిని పార్టీలోకి తీసుకురావడం ఎలా? ఎన్నికల ముందే పార్టీలో చేర్చుకోవాలా? లేదా పరోక్షంగా మద్దతు ఇచ్చే ఎన్నికల తరువాత పార్టీలో చేర్చుకోవాలా? అనేక అంశాల పైన క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలను తీసుకొని తదనుగుణంగా వ్యవహాలను సిద్ధం చేసే పనిలో ఉన్నారు.

**తీవ్ర ఆందోళనలో 25 మంది ఎమ్మెల్యేలు** : ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో 25 మంది ఎమ్మెల్యేలు వచ్చే ఎన్నికల్లో గెలిచే పరిస్థితి లేదని, వారిని మారిస్తే మళ్లీ అధికారం బీఆర్ఎస్ పార్టీ దేనని ఇటీవల ఎర్రబెల్లి దయాకర్ రావు బహిరంగంగానే సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇక ఈ నేపథ్యంలోనే కెసిఆర్ కూడా విజయానికి అవకాశం లేని ఎమ్మెల్యేల పైన దృష్టి సారించి, వారి విషయంలో నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో నిర్వహించనున్న సర్వే సీఎం కేసీఆర్ వద్ద మంచి మార్కులు లేని ఎమ్మెల్యేలకు వణుకు పుట్టిస్తుంది. దాదాపు 25 మంది ఎమ్మెల్యేలు కెసిఆర్ తాజా సర్వే నేపథ్యంలో తీవ్ర ఆందోళనలో ఉన్నట్టు సమాచారం.

**టికెట్ విషయంలో మల్లగుల్లాలు పడుతున్న ఎమ్మెల్యేలు** : కెసిఆర్ అన్న మాట ప్రకారంగా టికెట్ మళ్ళీ తమకు ఇస్తారా? లేక మరేదైనా కారణం చెప్పి తమకు టికెట్ ఇవ్వకుండా ఇబ్బంది పెడతారా? వంటి అనేక ప్రశ్నలు ఆ ఎమ్మెల్యేలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మొత్తానికి సీఎం కేసీఆర్ తీసుకున్న తాజా నిర్ణయం అధికారి ఎమ్మెల్యేల దృష్టిని సర్వే పై మళ్లేలా చేసింది. ఇక బీఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేసిన జాతీయ రాజకీయాలలో చక్రం తిప్పాలని భావిస్తున్న కేసీఆర్ సొంత రాష్ట్రంలో గెలవడం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు.

**సర్వే ఫలితాలను బట్టి ప్రస్తుత బీఆర్ఎస్ ఎమ్మెల్యేల భవిష్యత్తు** : ఒకపక్క తెలంగాణ రాష్ట్రంలో ఈసారి ఎలాగైనా బీఆర్ఎస్ పార్టీని గద్దె దింపాలని బీజేపీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్లను నిర్వహిస్తూ ప్రజల్లోకి వెళుతుంది. ఇక మరొక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాదయాత్ర పేరుతో ప్రజా మద్దతును కూడగట్టడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఇదిలా ఉంటే కేసీఆర్ తెలంగాణాలో మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని, జాతీయ రాజకీయాలలో చక్రం తిప్పాలని భావిస్తున్న కేసీఆర్ గెలుపు గుర్రాలకు మాత్రమే అవకాశం ఇవ్వడానికి చూస్తున్నారు. ఇందులో భాగంగా నిర్వహిస్తున్న సర్వేల ఫలితాలను బట్టి ప్రస్తుత బీఆర్ఎస్ ఎమ్మెల్యేల భవిష్యత్తు ఉండబోతుంది. ఈ క్రమంలోనే కెసిఆర్ తాజాగా నిర్వహించనున్న సర్వే అందరిలో ఉత్కంఠను రేపుతుంది.

# సంపాదకీయం

## ఆ మందులో ఏముంది.. అగ్ర రాజ్యం ఎందుకు వణుకుతోంది?

ఇటీవల ఆఫ్రికా ఖండంలోని జాంబియా దేశంలో భారతదేశ తయారీ అయిన ఒక దగ్గు మందు చిన్నారుల ప్రాణాలను తీసిన సంగతి తెలిసిందే. దీంతో ఆ మందుపై నిషేధం వేటు పడింది. ఇప్పుడు ఇదే తరహాలో ప్రస్తుతం ఒక డ్రగ్ (మందు) అగ్రరాజ్యం అమెరికాను వణికిస్తోంది. ఆ మందు పేరు.. జాంబీ డ్రగ్. గుర్రాలు ఆవులు తదితర జంతువుల్లో నరాలకు విశ్రాంతిని ఇచ్చేందుకు ఈ మందును వినియోగిస్తుంటారు. ఇప్పుడు ఈ ట్రాంక్విలైజర్ మనుషుల ప్రాణాలను తీస్తోందని చెబుతున్నారు. జాంబీ డ్రగ్ ను ఫెంటానిల్ అనే డ్రగ్తో కలిపితే అత్యధిక పొటెన్సీతో కూడిన ప్రాణాంతకమైన మత్తుమందుగా మారుతోందని పేర్కొంటున్నారు. దీన్ని మత్తు పదార్థాలకు బానిసలైన వాళ్లు విచ్చలవిడిగా ఉపయోగిస్తున్నారని అంటున్నారు. దీంతో దీన్ని మత్తు మందుగా తీసుకున్నవారి శరీరం తీవ్ర దుష్ప్రభావాలను లోనవుతోందని అంటున్నారు. ఈ మందు చాలా చౌకగా దొరుకుతుండటంతో డ్రగ్ డీలర్లు కొన్నేళ్లుగా దీన్నే విచ్చలవిడిగా సరఫరా చేస్తున్నారు. ఈ మందును ట్రాంక్ ట్రాంక్ డోప్ జాంబీ డ్రగ్ అని పిలుస్తున్నారు. ఈ డ్రగ్ ప్రస్తుతం అమెరికాలో ఎక్కడ చూసినా విచ్చలవిడిగా లభిస్తోందని తెలుస్తోంది. దీంతో మత్తు పదార్థాలకు అలవాటు పడినవారు ట్రాంక్ (జాంబీ) తీసుకుంటున్నారు. దీంతో వారి శరీరంపై తీవ్ర దుష్ప్రభావాలు పడుతున్నాయని చెబుతున్నారు. ఒంటిపై పుండ్లు పడటం చర్మం ఊడిపోవడం నిస్సత్తువ ఆవరించడం శరీరంలో జీవ శక్తులన్నీ అడుగంటిపోయే దుస్థితి సంభవించడం వంటివి చోటు చేసుకుంటున్నాయని అంటున్నారు. ఆ తర్వాత అడుగు తీసి అడుగేయడమూ కష్టమై జీవచ్ఛవాల్లా పరిస్థితి మారుతోంది. కాగా జాంబీ దారుణాలకు అమెరికాలోని ఫిలడెల్ఫియా కేంద్ర స్థానమని చెబుతున్నారు. సహజంగానే ఈ నగరం డ్రగ్స్ డీలర్లకు బానిసలకు అడ్డా అని తెలుస్తోంది. జాంబీ డ్రగ్ వాడకం కూడా ఇక్కడ విచ్చలవిడిగా పెరిగింది. ఎక్కడ చూసినా డ్రగ్ బానిసలే వీధుల్లో పడిపోయి కనిపిస్తున్నారని చెబుతున్నారు. అమెరికాలోని ఫిలడెల్ఫియా న్యూయార్క్ మసాచుసెట్స్ మైన్ కాలిఫోర్నియా ఓరెగాన్ వాషింగ్టన్ టెక్సాస్ లూసియానా అలబామా... ఇలా 36కు పైగా రాష్ట్రాల్లో వేలాది జాంబీ కేసులు వెలుగు చూడటం అధికారులను ఆందోళన పరుస్తోంది. 2021లో లక్ష మందికి పైగా డ్రగ్స్కు బలయ్యారని అమెరికా గణాంకాలు తెలుపుతున్నాయి. వీటిలో 70 వేలకు పైగా కేసుల్లో ఫెంటానిల్ వాడినట్టు రుజువు కావడం గమనార్హం. ఆ డ్రగ్ వాడినవారిలో కేంద్ర నాడీ వ్యవస్థ తీవ్రంగా ప్రభావితమవుతుందని చెబుతున్నారు. రక్తనాళాలు పాడై రోగ నిరోధక శక్తి క్షీణిస్తోందని తెలుస్తోంది. చర్మం ఊడటంతో పాటు ఒళ్లంతా పుండ్లు పుడతాయి. ఆ పుండ్లు బాగా పెద్దవై ముదిరిపోయి అవయవాలను కుళ్లిపోయేలా చేస్తోంది. పూర్తి మతిమరుపు గుండె ఊపిరితిత్తుల పనితీరు మందగించడం బీపీ పడిపోయి శ్వాస అందక మనిషి మరణించడం చోటు చేసుకుంటాయని చెబుతున్నారు.

# ఎన్నాళ్లకో.. గృహాయోగం



నిర్మల్ : రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని పేదలకు రెండు పడకగదుల ఇళ్లు ఇస్తామనడంతో.. గూడు లేని వారిలో ఆశలు చిగురించాయి. ఆ దిశగా అడుగులేసిన సర్కారు టెండర్ల ద్వారా ఇళ్ల నిర్మాణాలను గుత్తేదారులకు అప్పగించింది. ఈ ప్రక్రియలో చాలా చోట్ల రాజకీయ నాయకులే కాంట్రాక్టు అవతారమెత్తారు. అయిదేళ్ల కిందట ఆర్భాటంగా పనులు ప్రారంభించినా.. కేటాయించిన డబ్బులు సరిపోవని సాకులు చెబుతూ నిలిపివేశారు. ఈక్రమంలో అన్నీ తామై నిబంధనలకు విరుద్ధంగా లబ్ధిదారులను ముందే ఎంపిక చేసి అదనపు సొమ్ము కోసం లోపాయికారి ఒప్పందంతో ఒక్కొక్కరి నుంచి రూ.50 వేల నుంచి రూ.లక్ష వసూలు చేసినట్లు విమర్శలున్నాయి. అయినా నిర్మాణాలు పూర్తి కాలేదు. కాగా చేసిన పనులకు బిల్లుల చెల్లింపులు లేక నిర్మాణ దశలోనే నిలిపి వేస్తున్నట్లు గుత్తేదారులు చెబుతున్నారు. కొన్నిచోట్ల రెండేళ్ల కిందట నిర్మాణాలు పూర్తి చేసి పంపిణీకి సిద్ధం చేసినా.. కేటాయించలేదు. పండగలను అడ్డం పెట్టుకుని దసరా, దీపావళి, ఉగాది అంటూ ఊరిస్తున్నారని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో గూడు లేని పేదలు అధికంగా ఉండగా నిర్మించిన ఇళ్లు తక్కువగా ఉండటంతో.. సీఎం కేసీఆర్ గతంలో శాసనసభలో ఓ ప్రకటన చేశారు. ఇల్లు లేక స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.3 లక్షలు చెల్లిస్తుందని స్పష్టం చేశారు. దీంతో పూర్తయిన ఇళ్ల పంపిణీకి మార్గం సుగమం అయిందని అందరూ భావించారు. కానీ దీంతో ఎన్ని పండగలు పోయినా పంపిణీకి నోచుకోవడం లేదు. ఇది ఇలా ఉంటే సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునే పేదలకు ప్రభుత్వం అందిస్తాన్న రూ.3 లక్షల పథకం ఎనిమిది నెలలైనా అమలుకు నోచుకోలేదు. ఈ దసరాకైనా ఇళ్లు దక్కేనా అని అర్హులు ఎదురు చూస్తున్నారు.

నిర్మల్ పట్టణంలోని బంగాల్‌పేట్ మహాలక్ష్మి ఆలయ సమీపంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్ల సముదాయం ఇది. ఇక్కడ 1,380 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని అభ్యంతరాలు రావడంతో పంపిణీ ప్రక్రియ నిలిచింది. మళ్లీ పారదర్శకంగా ఎంపిక చేసేందుకు అధికారులు సర్వే చేస్తున్నారు. ఇప్పటికైనా అర్హులకు న్యాయం చేసి దసరా పండగకు ఇల్లు ఇవ్వాలని కోరుతున్నారు.

భైంసా కమలాపూర్ గుట్ట సమీపంలో నిర్మించిన గృహ సముదాయం ఇది. ఇక్కడ 200 ఇళ్లతో కూడిన సముదాయం పూర్తయి రెండేళ్లు కావొస్తోంది. రెండో విడతలో మరో 600 ఇళ్ల సముదాయాలను డిగ్రీ కళాశాల సమీపంలో నిర్మిస్తున్నారు. పనులు తుది దశకు చేరాయి. కాగా పూర్తయిన 200ల ఇళ్ల సముదాయంలో గుండేగాం బాధితులు తాత్కాలికంగా నివాసం ఉన్నారు. దీంతో లబ్ధిదారుల ఎంపిక జరపక పంపిణీ చేయడంలేదని తెలుస్తోంది. ఫలితంగా పట్టణ పేదలు ఇళు ఎప్పుడు దక్కుతాయోనని ఎదురు చూపులు చూస్తున్నారు. ఖానాపూర్ పురపాలక సంఘంలో చేపట్టిన 400ల ఇళ్ల సముదాయం పూర్తయింది. పంపిణీకి సిద్ధంగా ఉన్నా వాటిని ఇప్పటికి అర్హులకు అందించలేదు. ఇటీవలి భారీ వర్షాలకు ఇళ్లులేని పేదలు 20రోజుల కిందట రెండు పడక గదుల ఇళ్లలో తలదాచుకునేందుకు ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఆక్రమించుకునే యత్నం చేయగా.. పోలీసులు అడ్డుకొన్నారు. వెనుతిరిగిన వారు ఇళ్ల పంపిణీ కోసం ఎదురు చూస్తున్నారు.

# రేషన్ గోదాముల్లో గోల్‌మాల్!



నిర్మల్ : సుబేదారి ప్రాంతంలోని ఓ రేషన్ డీలర్ తమ దుకాణానికి సరఫరా చేసిన బియ్యం బస్తాల్లో సీల్ వేసిన 50 కిలోల బియ్యం బస్తాను కాంటాలో వేసి తూకం వేస్తే 47 కిలోలే వచ్చింది. ఇదేంటని సదరు గోదాము నిర్వాహకులను అడిగితే సీల్ వేసిన బస్తా తాము ఎలా తగ్గిస్తామంటూ దుబాయించారు. పరకాల నియోజకవర్గంలోని ఓ మండల డీలర్‌కు దిగుమతి అయిన బియ్యం బస్తాలను తూకం వేస్తే ఒకదాంట్లో 49, మరో దాంట్లో 48, 47 కిలోలు చూపిస్తోంది. ఇదే విషయాన్ని జిల్లా పౌర సరఫరాల అధికారులకు విన్నవిస్తే సదరు డీలర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసి ఇలా ఎందుకు జరిగిందంటూ ఆరా తీశారు.

పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో బియ్యం నిల్వ చేసే గోదాముల్లో అవినీతి రాజ్యమేలుతోంది. పేదల ఆకలి తీర్చాల్సిన ప్రజా పంపిణీ బియ్యానికి అక్రమార్కులు కన్నం పెడుతున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి జిల్లాలోని 414 రేషన్ దుకాణాలు, మధ్యాహ్న భోజనం నిమిత్తం వివిధ పాఠశాలలకు కోటా ప్రకారం బియ్యం పంపిణీ జరుగుతోంది. ఇలా సరఫరా అవుతున్న 50 కిలోల బియ్యం బస్తాల్లో రేషన్ దుకాణానికి చేరేసరికి సుమారు 4 కిలోల వరకు తగ్గుతుండటంతో డీలర్లు గగ్గోలు పెడుతున్నారు. మరోవైపు అధికారులు మాత్రం బియ్యం బస్తా సంచితో కలిపి 51 కిలోలు ఉంటుందని చెబుతున్నా తరుగు పడుతున్న బియ్యం ఎక్కడికి వెళుతోందనేది అర్థం కావడం లేదు.

తరుగు ఎవరు భరించాలి..బియ్యం పారదర్శక పంపిణీ కోసం ప్రభుత్వం ఈ-పాస్ విధానం అమలు చేస్తోంది. ఇందులో ఒక గ్రాము బియ్యం తక్కువ తూకం వేసినా యంత్రం తీసుకోదు. మరోవైపు తమకు వచ్చే కమీషన్‌లోనే దిగుమతిలో బస్తాకు రూ.5 చొప్పున హమాలీలకు, దుకాణం, అద్దె, సహాయకుడికి వేతనం ఇవ్వాల్సి వస్తోందని, చివరికి తమకు మిగిలేది తక్కువేనని వాపోతున్నారు. ఈ క్రమంలోనే తరుగు ఎవరు భరించాలని డీలర్లు ఆవేదన చెందుతున్నారు. మధ్యాహ్న భోజనం బియ్యంలోనూ తరుగు వస్తోందని పలువురు ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. దీనిపై గట్టిగా ప్రశ్నిస్తే తనిఖీలకు వచ్చే కొందరు అధికారులు దుకాణంలో బియ్యం నిల్వలు తక్కువగా ఉండటం నేరంగా పరిగణించి కేసులు పెడుతామంటూ భయపెడుతున్నారని డీలర్లు చెబుతున్నారు. ప్రతీ నెలా ఇవ్వాల్సిన స్టాక్ సైతం సమయానికి ఇవ్వడంలేదన్నారు.

ఏటా రూ.2.98 కోట్ల నష్టం..ఒక్కో రేషన్ దుకాణానికి ఈ లెక్కన మూడు క్వింటాళ్ల వరకు కోత పడుతోంది. మార్కెట్ రేట్ మూడు క్వింటాళ్లకు రూ.6వేల చొప్పున జిల్లాలోని 414 రేషన్ దుకాణాల్లో మొత్తం 1,24,200 కిలోల బియ్యం పక్కదారి పడుతోంది. దీని విలువ రూ.24.84లక్షల విలువ ఉంటే, అంతిమంగా ఏటా రూ.2.98 కోట్ల వరకు నష్టం జరుగుతోంది.

ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద..ధాన్యాన్ని మిల్లర్లు బియ్యంగా మార్చి ఎఫ్‌సీఐకి పంపిస్తారు. అక్కడి నుంచి స్టేజ్-1 కాంట్రాక్టర్‌కు, అతడి నుంచి స్టేజ్-2 కాంట్రాక్టర్ వద్దకు వెళ్తుంది. అక్కడి నుంచి ఎంఎల్ఎస్ గోదాములకు చేరుస్తారు. ఈ పాయింట్ల వద్దనే తరుగు తతంగం నడుస్తుందనే ఆరోపణలున్నాయి. బస్తాల్లో నుంచి కోత విధించిన బియ్యాన్ని రహస్య ప్రాంతాలకు తరలించి రీసైక్లింగ్ చేసి అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. కోత కట్టడి చేయాలంటే మిల్లర్ల నుంచి డీలర్ల వద్దకు చేరేవరకు ప్రతి చోట వెయింగ్ మిషన్లు ఏర్పాటు చేయాలి. ఈ-పాస్ విధానంతో డీలర్లు ఎలా పంపిణీ చేస్తున్నారో అలాగే కింది స్థాయి వరకు బియ్యం సరఫరా కావాలి. అధికారులు నిరంతరం గోదాముల్లో పరిశీలన చూస్తూ బస్తాలు నిర్ణీత బియ్యం బస్తాలతో ఉన్నాయా.. లేదా.. అన్నది చెక్ చేస్తుండాలి.

మా దృష్టికి తీసుకొస్తే చర్యలు.. : - జి.సంధ్యారాణి, అదనపు కలెక్టర్

ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి బియ్యం తీసుకెళ్లే ముందు డీలర్లు తూకం వేసుకోవాలి. ప్రతి బస్తాకి తక్కువ రావడమంటూ జరుగకపోవచ్చు. ఎక్కడైనా అలాంటిది ఉంటే కావాలని తక్కువ పెట్టడం లాంటివి జరిగినట్లు మా దృష్టికి వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

గోదాముల వద్ద వేయింగ్ మిషన్లు పెట్టాలి.. : - బత్తుల రమేష్‌బాబు, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు

బియ్యం బస్తాల్లో తక్కువ తూకం రావడం వలన డీలర్లు ఇబ్బందులు పడుతున్నారు. గోదాముల వద్ద వేయింగ్ మిషన్లు ఏర్పాటు చేయాలి. చాలా రోజులుగా ఈ సమస్యపై అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నాం. ఇప్పటికైనా స్పందించి అధికారులు ఎక్కడ లోపం జరుగుతుందో గుర్తించి చర్యలు తీసుకోవాలి.

# సీఎం కేసీఆర్‌ది పారదర్శక పాలన



నిర్మల్ : రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పార్టీలకతీతంగా పాదర్శక పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు చర్లపల్లిలో నూతనంగా మంజూరైన ఆసరా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై వృద్ధులకు, దివ్యాంగులకు పింఛన్లు అందజేశారు. ఆసరా పింఛన్లతో వృద్ధులకు ఆత్మగౌరవాన్ని పెంచిన ఘనత సీఎందేనన్నారు. చర్లపల్లి సర్పంచి తిరుపతిరెడ్డి, ఎంపీపీ అనసూర్య, జడ్పీటీసీ సభ్యురాలు సుమలత, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, మాదారం సొసైటీ ఛైర్మన్ లింగమూర్తి, వైస్ ఎంపీపీ కుమారస్వామి, తెరాస మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రమౌళి, గణపతిరెడ్డి పాల్గొన్నారు.

# అడుగులు పడుతున్నాయ్..!

మహబూబాబాద్ : కొన్నేళ్లుగా మిర్చి పరిశోధన స్థానం ఏర్పాటుకు చేస్తున్న ప్రయత్నాలకు ఎట్టకేలకు అడుగులు పడుతున్నాయ్. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. అవసరమైన స్థల ఎంపిక పూర్తయింది. నర్సంపేట శాసనసభ్యుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి పరిశోధన స్థానం ఏర్పాటు బాధ్యతను తీసుకుని కృషి చేస్తున్నారు. కొంతకాలంగా నియోజకవర్గంలోని నెక్కొండ, నర్సంపేట, నల్లబెల్లి ఖానాపురం ప్రాంతాల్లో స్థలం పరిశీలించారు. ఎక్కడ కూడా అనువైన స్థలం లభించలేదు. చివరకు మూడు రోజుల కిందట నల్లబెల్లి మండల కేంద్రానికి సమీపంలో స్థలాన్ని ఎంపిక చేయడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా మిర్చి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

56 ఎకరాలు గుర్తింపు

తొలుత ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా ఉద్యానశాఖ శాస్త్రవేత్తలు, ఇతర శాఖల అధికారులు కలిసి నెక్కొండ మండలం బొల్లిగొండ వద్ద పరిశీలించారు. వసతులు లేకపోవడం.. స్థలం కూడా అనుకూలంగా లేదని గుర్తించారు. అక్కడి నుంచి నల్లబెల్లి మండలంలో 365వ జాతీయ రహదారికి సమీపంలో 56 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. అక్కడ పరిశోధన స్థానం ఏర్పాటుకు అవసరమైన వసతులు ఉండడంతో అధికారులు సంతృప్తి చెందారు. ఈ స్థలం అందరికీ అనుకూలంగా ఉంటుందని భావించి ఆమోదించారు.

మిర్చి రైతులకు ప్రయోజనం

ఏటా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1.30 లక్షల ఎకరాల్లో మిర్చి సాగవుతోంది. ఇందుకోసం కోట్ల రూపాయల విత్తనాల కొనుగోలు జరుగుతుంది. అందులో 40 శాతం నాణ్యతలేని, నాసిరకం, నకిలీ విత్తనాలతోనే అన్నదాతలు మోసపోతున్నారు. మిర్చి పరిశోధన స్థానం అందుబాటులోకి వస్తే ఇలాంటి బెడద ఉండదని.. మేలు రకమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చేలా పరిశోధనలు జరుగుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లాలో మిర్చి నుంచి నూనె తీసే మిల్లులు వచ్చాయి. ఇంకా ఎటువంటి ఉత్పత్తులు తయారుచేయవచ్చో ఇక్కడ పరిశోధనలు చేసే వీలుంది. ఉమ్మడి జిల్లాలో చపాటా మిర్చికి భౌగోళిక గుర్తింపు లభించనుంది. ఇటువంటి వంగడాలు అనేకం ఈ స్థానం నుంచి వచ్చే అవకాశం ఉంది. ఈ పరిశోధన కేంద్రం ఏర్పాటైతే పక్కనే ఉన్న ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులకూ ప్రయోజనం చేకూరనుంది.

సర్కారుపైనే ఆశలు

ఎట్టకేలకు స్థల గుర్తింపు పూర్తయింది. ఇక పరిశోధన స్థానం ఏర్పాటు..అందుకు అవసరమైన నిధుల కేటాయింపుపై సర్కారుపైనే ఆశలున్నాయి. ఈ విషయంలో చకచకా అడుగులు పడేందుకు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఉద్యాన శాఖ అధికారులు ప్రతిపాదనలను త్వరితగతిన ప్రభుత్వానికి నివేదించాల్సిన అవసరం ఉంటుంది. ఈ కసరత్తును త్వరలో పూర్తి చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉద్యానశాఖ శాస్త్రవేత్త ఒకరు తెలిపారు.

రూ.32 కోట్ల మంజూరుకు ప్రతిపాదనలు

నర్సంపేట, న్యూస్‌టుడే: మూడేళ్ల క్రితం ఖానాపురం మండలం అశోక్‌నగర్‌లో భూమిని ఎంపిక చేయడంతో పాటు ప్రభుత్వం రూ.22 కోట్లు మంజూరు చేసిందన్నారు. అది అటవీ భూమి కావడంతో మిర్చి పరిశోధన కేంద్రానికి భూమి కేటాయింపు ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వ విద్యాలయం అధికారులు మిర్చి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు రూ.32 కోట్లు మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే వివరించారు. ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ నీరజా ప్రభాకర్ వచ్చే వారంలో ఈ భూములను పరిశీలిస్తారని తెలిపారు.ప్రస్తుతం కన్నరావుపేటలో గుర్తించిన భూమిని ఉప కులపతి పరిశీలించాక రెవెన్యూ శాఖ నుంచి ఉద్యాన విశ్వవిద్యాలయానికి భూమి అప్పగింత పూర్తయ్యాక వచ్చే రెండేళ్లలో మిర్చి పరిశోధన కేంద్రం పనులు పూర్తి చేసే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారని వెల్లడించారు.

# డబ్బు కొట్టు.. ఇంటి నంబరు పట్టు!

పట్టణంలో ఎనిమిదో వార్డుకు చెందిన ఒకరు రిజిస్ట్రేషన్ పత్రాలు, లింకు పత్రాలు భవన నిర్మాణ నక్షా (ప్లాను) జత చేసి నిబంధనల మేరకు దరఖాస్తు చేసి మున్సిపల్ నుంచి అనుమతి తీసుకొని మూడేళ్ల క్రితం భవనం నిర్మించారు. ఆ భవనానికి ఇప్పటికీ ఇంటి నంబరు కేటాయించలేదు. పట్టణానికి చెందిన ఒకరు స్థలం కొనుగోలు చేశారు. దానికి రిజిస్ట్రేషన్ పత్రాలు, లింకు డాక్యుమెంట్లు వంటివి ఏమీ లేవు. ఆ స్థలంలో చిన్న గది కట్టుకున్నారు. నిబంధనల మేరకు ఆ గదికి ఇంటి నంబరు ఇవ్వడం కుదరదు. కాని పురపాలక అధికారి ఒకరికి అడిగినంత ముడుపులు ముట్టజెప్పడంతో ఇంటి నంబరుతో పాటు అసెస్‌మెంటు నంబరు కేటాయించారు.

ఇలా నర్సంపేట పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నంబర్ల కేటాయింపుల మాటున పెద్ద ఎత్తున వసూళ్ల దందా సాగుతోంది. ఇంత జరుగుతున్నా పుర ఉన్నతాధికారులు ఏమీ ఎరగనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. అక్రమ పద్ధతిలో ఇంటి నంబర్ల కేటాయింపుతో మున్సిపల్ ఆదాయానికి గండి పెడుతూ అధికారుల జేబులు దండుకుంటున్నారు.

నిబంధనలు ఏమి చెబుతున్నాయిప్రభుత్వ నిబంధనల ప్రకారం స్థలమున్న వారు ఇల్లు, భవనం నిర్మించుకోవాలన్నా, ఇంటి నంబరు కావాలంటే స్థలం సంబంధించిన రిజిస్ట్రేషన్, సొంత స్థలమైనట్లు దస్తావేజులు ఉండాలి. కొనుగోలు చేసినట్లయితే లింకు దస్తావేజులు తప్పకుండా ఉండాలి. నిర్మించే భవన, ఇంటి నక్షా(ప్లాను) జత చేయాలి. ఇంతకు ముందు నిర్మించిన ఇల్లు, గది అయితే వాటి చిత్రాలు జతచేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అది పురపాలక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ)పరిశీలించాక కమిషనర్ ఆమోదముద్ర వేస్తారు. అప్పుడు నిబంధనల ప్రకారం నిర్ణీత రుసుం పురపాలక సంఘానికి చెల్లిస్తే దానికి పరిసరాల ఇళ్ల నంబర్ల పరిశీలించి వరుస క్రమంలో అప్పుడు ఇంటి నంబరు, అసెస్‌మెంటు సంఖ్యను కేటాయించాలి. కాని అధికారులు రిజిస్ట్రేషన్ పత్రాలు, లింకు డాక్యుమెంట్లు లేకుండా ఆధార్ కార్డును జత చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే అందులో అడిగే కాలాల్లో పత్రాల్లేకున్నా ఉన్నట్లు తప్పుడు పత్రాలు సృష్టించి పెద్ద మొత్తంలో వసూలు చేసి నంబర్లు ఇస్తున్నారు.

ఒక్కో ఇంటికి రూ.50 వేలుఅక్రమ పద్ధతిలో ఇంటి నంబర్ల కేటాయింపులో ఒక్కో ఇంటికి రూ.50వేల నుంచి రూ.60 వేల దాకా వసూలు చేస్తున్నారు.ఇందుకు ఒప్పంద పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగి మధ్యవర్తిగా వ్యవహరిస్తూ , వచ్చిన ముడుపులను వాటాలు వేసి పంచుకుంటున్నారు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నంబర్లు ఇచ్చినవి రెండంకెల్లో ఉన్నాయి. సంబంధిత అధికారులు చొరవ చూపి ఈ బాగోతంపై విచారణ జరిపి కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ఆశల గూడుకు ఎన్నాళ్లో నిరీక్షణ!

సిరిసిల్ల : కప్పు దశకు పూర్తయిన నిర్మాణాలు ఓ చోట.. పనులు పూర్తయినా మౌలిక వసతులు కల్పించని పరిస్థితి మరో చోట.. పూర్తి స్థాయిలో నిర్మాణాలు, వసతుల కల్పన జరిగినా లబ్ధిదారులకు కేటాయించని వైనం ఇంకో చోట.. ఇదీ ప్రస్తుతం జిల్లాకేంద్రంలో రెండు పడక గదుల ఇళ్ల పథకం దుస్థితి. పనులు ప్రారంభించి నాలుగేళ్లయినా నిర్మాణంలో అంతు లేని జాప్యం నెలకొంది. ఫలితంగా సొంతింటి కల ఎప్పుడు సాకారమవుతుందా? అని వేయి కళ్లతో లబ్ధిదారులు ఎదురుచూడాల్సి వస్తోంది.

పనులు పూర్తయినా మౌలిక వసతులేవీ!

రెండు పడక గదుల ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులు వివిధ సర్వేలు జరిపారు. వార్డు సభలు నిర్వహించారు. ఒకటికి నాలుగు సార్లు సర్వేలు పూర్తి చేసి జిల్లాకేంద్రంలోని 39 వార్డుల్లో అర్హులను డ్రా పద్ధతిలో ఎంపిక చేశారు. వీరి కోసం పెద్దూరు, సిరిసిల్ల బైపాస్ రోడ్డు, రగుడులో ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. పట్టణ పరిధిలోని శాంతినగర్‌లో 204 ఇళ్లు, రగుడు వద్ద 72, పెద్దూరులో 516 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధం చేసినప్పటికీ చిన్నచిన్న పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక మండెపల్లిలో తప్ప, సిరిసిల్ల బైపాస్‌రోడ్డు, రగుడు, పెద్దూరులో నిర్మాణాలు పూర్తయినా పంపిణీకి సిద్ధంగా లేవు. ఇటీవలి తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు ముందు జిల్లా అదనపు పాలనాధికారి ఖీమ్యానాయక్ పెద్దూరు, రగుడు, సిరిసిల్ల మొదటి బైపాస్‌రోడ్డులో ఇళ్ల నిర్మాణ పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి జూన్ 2 నాటికి పంపిణీకి సిద్ధం చేయాలని మున్సిపల్, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఉత్సవాలు పూర్తయినా ఇప్పటికీ చిన్న చిన్న పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి.

2052 ఇళ్లకు 1700 మంది ఎంపిక

సిరిసిల్ల పురపాలక సంఘం పరిధితో పాటు తంగళ్లపల్లి మండలంలో నిరుపేదలకు ప్రభుత్వం మొదటి విడతలో 2,684 ఇళ్లు మంజూరు చేసింది. 2,388 నిర్మాణాలకు టెండర్లు వేయగా 2,248 చోట్ల పనులు ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా మొదటి విడతలో 6,786 గృహాలు మంజూరు కాగా ప్రజావాణి ద్వారా సమారు 75,743 మంది పేదలు, బీడీకార్మికులు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు సిరిసిల్ల మున్సిపాలిటీలో 792 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా మండెపల్లి శివారులో 2016-17లో ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో 1,260 నిర్మాణాలు పూర్తయ్యాయి. పట్టణంతో పాటు, మండెపల్లిలో మొత్తం 2052 ఇళ్లకు గాను పట్టణంలోని 39 వార్డుల్లో సర్వేలు, సభలు నిర్వహించి 1700 మందిని ఎంపిక చేశారు. ఇందులో 1260 మందికి మండెపల్లిలో ఇళ్లు పంపిణీ చేశారు. మిగతా 440 మందికి పంపిణీ చేయాల్సి ఉంది.

15 రోజుల్లో అప్పగిస్తాం

సిరిసిల్ల పట్టణంలోని మొదటి బైపాస్, రగుడు, పెద్దూరు ప్రాంతాల్లో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. చిన్న చిన్న పనులు మిగిలి ఉన్నాయి. వాటిని త్వరలోనే పూర్తి చేసి 15 రోజుల్లో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అప్పగిస్తాం.

-సమ్మయ్య, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్

# ఈసారైనా పనులు పూర్తయ్యేనా!

వేములవాడ: పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా మూలవాగులో చేపట్టిన ఆనకట్టల నిర్మాణం అసంపూర్తిగా మారింది. జిల్లాలో ప్రధాన నీటి వనరైన మూలవాగును జీవనదిగా మార్చాలనే ఉద్దేశంలో మూడేళ్ల కిందట 13 చోట్ల చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టారు. 11 చోట్ల పనులు పూర్తయినా రెండు మాత్రం అసంపూర్తిగా నిలిచాయి. గుత్తేదారుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఓవైపు వర్షాకాలం మొదలైనా కొలిక్కి రాకపోవడంతో ఈసారి కూడా అందుబాటులోకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. వేములవాడ, కోనరావుపేట ప్రాంతంలో మూడేళ్ల కిందట నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో మూలవాగులో దాదాపు రూ.65 కోట్లతో 13 చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టారు. ఇందులో 11 చోట్ల పనులు పూర్తి కావడంతో వర్షాకాలంలో నీటితో కళకళలాడుతున్నాయి. జిల్లాలో వీర్నపల్లి మండలంలో ప్రారంభమయ్యే మూలవాగు కోనరావుపేట, వేములవాడ గ్రామీణ మండలం మీదుగా శాభాష్‌పల్లి వద్ద మధ్యమానేరు(శ్రీరాజరాజేశ్వర) జలాశయంలో కలుస్తోంది.

11 చోట్ల ఏడాది కిందటే పూర్తి

వేములవాడ గ్రామీణ మండలం మల్లారం, వేములవాడ పట్టణం, తిప్పాపూర్, వేములవాడ శివారు మహాలక్ష్మీ వీధి, వీర్నపల్లి మండలం గర్జనపల్లి, కోనరావుపేట మండలం మర్రిమడ్ల, నిమ్మపల్లి, నిజామాబాద్, కొండాపూర్‌ల వద్ద చేపట్టిన చెక్‌డ్యాంల నిర్మాణం పనులు



ఏడాది కిందటే పూర్తయ్యాయి. వేములవాడ గ్రామీణ మండలం జయవరం, లింగంపల్లి వద్ద నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. పనులు చివరి దశకు చేరుకున్నప్పటికీ నత్తనడకన సాగుతున్నాయి. కాంక్రీట్ పనులతో పాటు పక్కన మట్టి బండ్ నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది.

భూగర్భ జలాల వృద్ధి

మూలవాగులో చెక్‌డ్యాం నిర్మాణాలు పూర్తయిన ప్రాంతాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. చెక్‌డ్యాంల వద్ద వెనుక జలాలతో పరిసర ప్రాంతాల్లోని బోర్లు, బావుల్లో నీటి మట్టం పెరిగింది. మెట్ట ప్రాంతం కావడంతో బావులు, బోర్లపై ఆధారపడి రైతులు వ్యవసాయం చేస్తుంటారు. మూలవాగులో చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో పరీవాహక ప్రాంతంలో భూగర్భ జల మట్టం పెరిగింది. గతంలో ఈ ప్రాంతంలో బావుల్లో 20 గజాలకు పైగా లోతులో నీరుండేది. ప్రస్తుతం పైపైకే వచ్చాయి. దీంతో పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. నీటి లభ్యత పెరగడంతో మూలవాగు పరీవాహకంలో అధిక విస్తీర్ణంలో వరి సాగు చేస్తున్నారు.త్వరగా పూర్తి చేసేలా చర్యలుమూలవాగులో జయవరం, లింగంపల్లి వద్ద చెక్‌డ్యామ్‌ల నిర్మాణం పనులు చివరి దశలో ఉన్నాయి. త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మట్టి బండ్ నిర్మాణం పనులు, కొంత సిమెంట్, కాంక్రీట్ పనులు చేయాల్సి ఉంది. వానాకాలం మొదలైన దృష్ట్యా వాగు పారితే చెక్‌డ్యామ్ పక్కకు కోతకు గురి కాకుండా ముందుగా బండ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం.శ్రీనివాస్, నీటిపారుదల శాఖ డీఈ

# ఇంటికే నేరుగా వంటగ్యాస్




గోదావరిఖని : ఇంటింటికీ పైపులైన్ల ద్వారా గ్యాస్ సరఫరా కొన్ని మహానగరాలకే పరిమితం. కాగా నగరాలు, పట్టణాలకు విస్తరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రాజెక్టు ద్వారా జిల్లాల వారిగా ఇంటింటికీ పైపులైన్లతో వంట గ్యాస్ సరఫరా పనులను వివిధ సంస్థలకు అప్పగించగా ఏర్పాట్లు పూర్తికావస్తున్నాయి. దీనిలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని వివిధ నగరాలు, పట్టణాలకు పైపులైనుతో గ్యాస్ సరఫరా చేసే పనులను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు అప్పగించారు. పైపులైన్లతో వంటగ్యాస్‌తో పాటు సీఎన్జీ వాహనాలకు గ్యాస్ సరఫరా చేసేలా కేంద్రాలను సైతం ఏర్పాటు చేస్తున్నారు. మొదటగా పెద్దపల్లి జిల్లాలోని రామగుండం ప్రాంతంలో ఫెర్టిలైజర్ సిటీ, గౌతమీనగర్, శాంతినగర్, మార్కండేయకాలనీ తదితర కాలనీల్లో గ్యాస్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నారు. ఎన్టీపీసీలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోలు బంకు ఆవరణలోనే సీఎన్జీ వాహనాలకు గ్యాస్ సరఫరా చేసే కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మరో రెండు నెలల్లో ఈ ప్రాంతంలో పైపులైన్లతో గ్యాస్ సరఫరా అయ్యే అవకాశముంది. రామగుండం ప్రాంతంలో మొత్తం పైపులైన్ల నిర్మాణం, కనెక్షన్లు ఇచ్చే ప్రక్రియ పూర్తయ్యాక క్రమక్రమంగా పెద్దపల్లి మీదుగా కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లోని పలు పట్టణాల్లో పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

ప్రత్యేకంగా ఏర్పాట్లు..

రామగుండం ఎరువుల కర్మాగారానికి గ్యాస్ సరఫరా చేసే పైపులైను నుంచి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ గ్యాస్‌ను తీసుకొని పైపులైన్ల ద్వారా స్థానిక వినియోగదారులకు సరఫరా చేయనుంది. ఇందుకోసం ఎరువుల కర్మాగారం సమీపంలోనే ప్రత్యేకంగా 'మదర్ స్టేషన్'ను నిర్మించారు. అక్కడి నుంచి కంప్రెషర్ నేచురల్ గ్యాస్(సి.ఎన్.జి.), పైపులైన్ నేచురల్ గ్యాస్(పి.ఎన్.జి.) సరఫరాకు రెండు వేర్వేరు పైపులైన్ల నిర్మాణం చేపట్టారు. పి.ఎన్.జి. పైపులైన్ల ద్వారా ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేయనుండగా సి.ఎన్.జి. పైపులైను ద్వారా నేరుగా వాహనాలకు సరఫరా చేసే కేంద్రాలకు తరలించనున్నారు. గౌతమీనగర్, శాంతినగర్ కాలనీల్లోని ప్రధాన రహదారుల వెంట పి.ఎన్.జి. పైపులైన్లు నిర్మించడంతో పాటు ఆయా వీధుల్లో అంతర్గత కనెక్షన్లు ఇచ్చేలా వాల్వులను ఏర్పాటు చేశారు. గౌతమీనగర్‌లోని కొన్ని గృహాల్లో పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరాకు అవసరమైన మీటర్లు, ఇతర నిర్మాణం చేపట్టారు. ఫెర్టిలైజర్ సిటీలో ఏర్పాటు కోసం సన్నాహాలు చేస్తున్నారు. విద్యుత్తు వినియోగం మీటర్ల మాదిరిగానే పైపులైను గ్యాస్ సరఫరా చేసే ఇంటి బయటి గోడకు ప్రత్యేకంగా గ్యాస్ వినియోగం మీటరును బిగిస్తారు. దీని ఆధారంగా ప్రతీనెలా రీడింగ్ ప్రకారం ఆన్‌లైన్‌లో బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. ఇక గ్యాస్ బుక్ చేసుకోవడం, డెలివరీ కోసం ఎదురు చూడాల్సిన ఇబ్బందులు లేకుండా ఎల్.పి.జి. గ్యాస్ ధరలకంటే తక్కువ ధరకు పైపులైనుతో నిరంతరంగా వంటగ్యాస్ సరఫరా ఉంటుంది. వినియోగానికి సంబంధించి మీటరు, పైపులైను మొత్తం ఇంటి బయట బిగించి గోడలోంచి వంటగదిలోని గ్యాస్ స్టవ్‌కు అనుసంధానం చేసేలా చిన్న పైపు ఉంటుంది. దీనివల్ల లీకేజీలాంటి ప్రమాదాలుండవు.

అన్ని వర్గాలకు అందుబాటులో...

అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా పైపులైన్ వంటగ్యాస్ సరఫరా పథకాలను ప్రవేశపెట్టారు. నామమాత్రంగా రిజిస్ట్రేషన్ రుసుము చెల్లిస్తే చాలు వినియోగించిన గ్యాస్ ఛార్జీలతో పాటు నెలసరి అద్దె చెల్లించే వెసులుబాటు ఉంది. ఒకేసారి ధరావత్తు మొత్తం చెల్లించలేని వారు వాయిదాల పద్ధతిలో చెల్లించే సదుపాయం ఉంది. అన్ని బిల్లులను ఆన్‌లైన్‌లోనే చెల్లించాల్సి ఉంటుంది. ఆధార్, ఓటరు ఐడీ, రేషను కార్డు తదితర గుర్తింపు కార్డులతో పాటు నిర్ణీత దరఖాస్తు ఫారాన్ని పూర్తిచేసి ఇవ్వాలి. ఇతర వివరాలకు 1800 425 5690 టోల్‌ఫ్రీ నెంబరు ద్వారా తెలుసుకోవచ్చు.

స్కీమ్-ఎ

సెక్యూరిటీ డిపాజిట్(రిఫండబుల్) రూ.6 వేలు, గ్యాస్ వినియోగం ధరావత్తు(రిఫండబుల్) రూ.500, రిజిస్ట్రేషన్ రుసుము రూ.118(నాన్ రిఫండబుల్) మొత్తం రూ.6,618 ఏకమొత్తంలో చెల్లించాల్సి ఉంటుంది.

స్కీమ్-బి

సెక్యూరిటీ డిపాజిట్(రిఫండబుల్) రూ.3 వేలు చెల్లించి మిగతా రూ.3 వేలను నెలకు రూ.125 చొప్పున రెండు సంవత్సరాల పాటు చెల్లించాల్సి ఉంటుంది. గ్యాస్ వినియోగం ధరావత్తు రూ.500 (రిఫండబుల్), రిజిస్ట్రేషన్ రుసుము రూ.413(నాన్ రిఫండబుల్) చెల్లించాల్సి ఉంటుంది.

స్కీమ్-సి

ముందుగా ఎలాంటి సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించలేని వారు నెలకు రూ.125 చొప్పున నాలుగు సంవత్సరాల పాటు చెల్లించే వెసులుబాటు ఉంది. కాకపోతే ఈ పథకంలో రిజిస్ట్రేషన్ రుసుము రూ.1,275తో పాటు గ్యాస్ వినియోగం ధరావత్తు(రిఫండబుల్) రూ.500 కలిపి మొత్తం రూ. 1,775 చెల్లిస్తే గ్యాస్ కనెక్షను ఇస్తారు.

స్కీమ్-డి

ఇందులో ఎలాంటి సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి అవసరం లేదు. కేవలం గ్యాస్ వినియోగం ధరావత్తు(రిఫండబుల్) రూ.500, రిజిస్ట్రేషన్ రుసుము రూ.118 మొత్తం రూ.618 చెల్లిస్తే సరిపోతుంది. సెక్యూరిటీ డిపాజిట్ లేనందున పైపులైన్ గ్యాస్ వినియోగించుకుంటున్నందుకు నెలవారీ గ్యాస్ వినియోగం బిల్లుతో పాటు ప్రతినెలా రూ.60 అద్దె చెల్లించాల్సి ఉంటుంది.

# నాకే 'మాట'రావట్లేదు..!

సిరిసిల్ల : నేను మీ టమాటను.. నన్ను నేను పలికేందుకు నాకే మాట రావట్లేదు. ఇక నా ధర ముచ్చట చెప్పడానికి ససేమిరా మనస్సు ఒప్పడం లేదు. విపణి వీధిలో నన్ను చూసి అమ్మో 'వంద'నా..? అని ఒక దండం పెడుతూ.. మీరు వెనుకడుగేస్తుంటే బాధేస్తోంది. ఆశగా కొనుగోలు చేసేందుకు వచ్చిన వారంతా నన్ను చూసి ముఖం చిట్లిస్తుంటే మనస్సు చివుక్కుమంటోంది.. అదోలా చూస్తూ ముట్టీ ముట్టనట్లు నన్ను చేతిలో పట్టుకుని కిలో కొనాలనుకున్న వాళ్లు పావు కిలోతో సరిపెట్టుకుంటే నా గుండె తరుక్కుపోతోంది. ఆశగా కొనుగోలు చేసేందుకు వచ్చిన వారంతా నన్ను చూసి ముఖం చిట్లిస్తుంటే మనస్సు చివుక్కుమంటోంది.. అదోలా చూస్తూ ముట్టీ ముట్టనట్లు నన్ను చేతిలో పట్టుకుని కిలో కొనాలనుకున్న వాళ్లు పావు కిలోతో సరిపెట్టుకుంటే నా గుండె తరుక్కుపోతోంది. నన్ను అమ్మే వారితోపాటు వంట చేసే మహిళలు ప్రియమైన వస్తువు లెక్క నన్ను జాగ్రత్తగా చూసుకుంటుంటే వింత అనుభూతి కలుగుతోంది.. ఒక్కసారిగా నాకు గతమంతా కళ్ల ముందు కదలాడుతోంది. ఒకప్పుడు ఇదే వ్యాపారులు, రైతన్నలు నన్ను ఒక్కటంటే ఒక్క రూపాయికి అమ్మడం కుదరక ఎక్కడ పడితే అక్కడ రోడ్డు పాలు చేసి బాధపడిన రోజులు యాది కొస్తున్నాయి. ప్రకృతి ప్రకోపమో.. ఇంకేవైనా కారణాలో నన్ను పండించే అన్నదాతలకు నా దిగుబడి ఎప్పటికప్పుడు శాపంగానే మారుతోంది. గంపెడాశలు పెట్టుకున్నప్పుడు రైతుకు పుట్టెడు శోకం కలుగుతోంది. చాలీచాలని తీరుతో సాగు చేసినప్పుడు నా ధర రెండు మూడింతలు రెట్టింపై



సామాన్యుడికి నన్ను కొనడమే గగనమవుతోంది. పంట సాగుకు ఉమ్మడి జిల్లాలో కనిపిస్తున్న తారతమ్యాలే ఇందుకు కారణం. ఒక్కోసారి విపరీతంగా సాగు చేస్తూ.. మరొక్క సారి పంట వేసేందుకు విముఖత చూపిస్తూ నన్ను ఆగం చేసి ధరల హెచ్చుతగ్గులకు కారణమవుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2018లో 22 వేల ఎకరాల్లో కూరగాయల్ని వేస్తే అందులో నా వాటా 18,212 ఎకరాలు. కాలక్రమేణా ఉద్యాన పంటల సాగు క్రమేణా మారింది. దీంతో నన్ను ఇప్పుడున్న కాలంలో ఐదారు ఎకరాల్లోనూ సాగు చేసే వారు కరవయ్యారు.సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. అరకొరగా నన్ను సాగు చేయగా ఇటీవల మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన అకాల వర్షాలతో పంట దెబ్బతిని నా ఉనికి ప్రశ్నార్థకమైంది. సుమారు 36 లక్షల జనాభా ఉన్న నాలుగు జిల్లాల్లో రోజుకు 1,800 టన్నుల కూరగాయల వినియోగం ఉంటుంది. ఇందులో నా వాటానే ఎక్కువ. ప్రస్తుతం ఆ స్థాయిలో ఉత్పత్తి ఊసే లేదు. ఎంత వెతికి చూసినా 520 టన్నుల కూరగాయల దిగుబడే వస్తుందని ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులు ఉసూరుమంటున్నారు. ఇంకా అదనంగా కావాల్సిన 1,280 టన్నుల కోసం ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకొంటున్నారు. నేనే కాదు నాతోపాటు మార్కెట్‌లో ఇతర కూరగాయల ధరలన్నీ చిందులు తొక్కుతున్నాయి. మిర్చి తన ధర ఘాటును కిలోకు రూ.160కి చేర్చింది. ఏ కూరగాయ చూసినా పావుకిలో రూ.20కిపైగా ఉండటం సామాన్యుడిని దిగాలు పరుస్తోంది. కూరగాయల సాగుకు కష్టాల కుదుపు లేని పరిస్థితులు ఉమ్మడి జిల్లాలో కనిపించాలి. ఇందుకు సరికొత్త కార్యాచరణ క్లస్టర్ల వారీగా సిద్ధం చేయాలి. కూరగాయల పంట కాలనీలు ఏర్పాటవ్వాలి. ప్రత్యామ్నాయ పంటలపై కర్షకుల్లో అవగాహన పెంచాలి. పత్తాలేని విత్తన రాయితీలు క్రమంగా దరిచేరాలి. మార్కెటింగ్ సౌకర్యం మెరుగవ్వాలి. దళారీ చిక్కుల దగా దూరమవ్వాలి. ప్రతికూల పరిస్థితులన్నీ మారి రైతు పరేషాన్ తీరాలి. అందరికిష్టమైన పచ్చడి సహా అన్ని రకాల వంటల్లో నేను అనునిత్యం కలవాలి. ఘుమ ఘుమల వాసనల్లో నన్ను తలుచుకుంటేనే మీ నోరూరాలి. అందుకనే నా మనసులోని మాటనిలా మీ ముందుంచుతున్నా. కూరగాయల సాగుకు మంచి రోజులు రావాలని మనసారా ఆశిస్తున్నా!

# నిధులు రాక.. నిర్వహణ లేక!



కరీంనగర్ : సర్కారు బడుల్లో సంస్కరణలు ముందుకు తీసుకెళ్తున్న ప్రభుత్వం వాటి నిర్వహణకు నిధులు కేటాయించకపోవడంతో కొన్ని సమస్యలు పరిష్కారం కావడంలేదు. పాఠశాలల నిర్వహణకు నయాపైసా లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులు సొంతంగా ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉమ్మడి జిల్లాలో బడుల పరిస్థితిపై కథనం. విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ప్రభుత్వం నిర్వహణ నిధులను మంజూరు చేస్తే ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రవేశాలపై దృష్టి నిలిపే అవకాశముంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 2465 ప్రభుత్వ పాఠశాలలుండగా 1,65,661 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రతి ఏటా మండల విద్యా వనరుల కేంద్రానికి రూ.90 వేలు, పాఠశాలల కాంప్లెక్స్‌కు రూ.33 వేలు, పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా రూ.10 వేల నుంచి రూ.80 వేల వరకు కేటాయిస్తున్నారు. విద్యాసంవత్సరం ముగియగానే మిగిలిన నిధులను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుంది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఇప్పటివరకు మంజూరు కాకపోవడంతో పాఠశాలల నిర్వహణ గాడి తప్పుతోంది.

పెద్ద సార్లపై భారం..బడుల నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయని కారణంగా ప్రధానోపాధ్యాయులపైనే భారం పడుతోంది. బడిబాట కార్యక్రమానికి ఫ్లెక్సీలు, కరపత్రాలు, సుద్దముక్కలు, హాజరు రిజిస్టర్లు, ఇతర సామగ్రిని సొంత డబ్బులతో కొనుగోలు చేస్తున్నారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలు, దశాబ్ది ఉత్సవాల సందర్భంగా వివిధ కార్యక్రమాల నిర్వహణ, మిఠాయిలు, బహుమతుల పంపిణీకి కూడా ఇదే పరిస్థితి. ఉచిత పాఠ్య, రాత పుస్తకాలు, ఏకరూప దుస్తుల రవాణా ఖర్చులను సొంతంగానే భరిస్తున్నారు. ప్రత్యేక కార్యక్రమాలకు ఖర్చులు తప్పడం లేదు. నిధుల లేమితో పాఠశాలలకు, తరగతి గదులకు అవసరమైన చిన్నచిన్న మరమ్మతుల జోలికి ఎవరూ వెళ్లడం లేదు. అంతర్జాలం, విద్యుత్తు బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. ఉమ్మడి జిల్లాలో చాలా పాఠశాలల్లో సీనియర్ స్కూల్ అసిస్టెంట్లే ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులుగా కొనసాగుతున్నారు.

సొంతంగా ఖర్చు చేయాల్సి వస్తోంది

నిధులు రాకోపోవడంతో రిజిస్టర్లు, ఇతర సామగ్రి, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ, బోర్ మోటారు మరమ్మతుకు ఇప్పటివరకు రూ.6 వేల వరకు సొంతంగా ఖర్చు చేశాను. ప్రభుత్వం విద్యాసంవత్సరం ప్రారంభం నాటికే విడుదల చేస్తే ఈ ఇబ్బందులుండవు.

ప్రభాకర్‌రావు, ప్రధానోపాధ్యాయుడు,జడ్పీ ఉన్నత పాఠశాల, ఒద్యారం

సగమైనా విడుదల చేయాలి

పాఠశాలలు ప్రారంభ రోజు నాటికి నిర్వహణ నిధులను ప్రభుత్వం మంజూరు చేయాలి. కార్యక్రమాల నిర్వహణకు జేబుల్లోంచే ఖర్చు చేయాల్సి వచ్చింది. కనీసం పాఠశాలకు రావాల్సిన వాటిలో సగమైనా చెల్లిస్తే బాగుంటుంది. ఆర్.శ్రీనివాస్,ప్రధానోపాధ్యాయుడు, జడ్పీ ఉన్నత పాఠశాల, కన్నాపూర్

# తెరచుకోనున్న బాబ్లీ గేట్లు

జగిత్యాల : వానాకాలం సీజను నెలరోజులు గడచినా ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా వరదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఆశించినట్లుగా వరద రాలేదు. ఈ నేపథ్యంలో జులై 1న మహారాష్ట్ర ప్రభుత్వం గోదావరిపైగల బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తనుండటంతో ఎస్సారెస్పీలోకి వరదనీటిరాకకు అవకాశం ఏర్పడనుంది. పరిమితంగానే వరద ఎస్సారెస్పీలోకి 2021 వర్షాకాలంలో 678 టీఎంసీలు, నిరుడు 2022 వర్షాకాలంలో 595 టీఎంసీల వరదనీరు వచ్చిచేరింది. కాగా ప్రస్తుతం ఎగువన వర్షాల్లేక ఎస్సారెస్పీలోకి అత్యంత పరిమితంగానే ఇన్‌ఫ్లో ఉంది. బాబ్లీ ప్రాజెక్టు గేట్లెత్తితే కొంతనీరు వచ్చే అవకాశం ఉండగా గోదావరి పరీవాహక ప్రాంతంలో సమృద్ధిగా వర్షాలు కురిస్తేనే శ్రీరాంసాగర్ నిండే అవకాశం ఉంటుంది. ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతలను చేపట్టి నంది, గాయత్రి పంపుహౌస్‌ల ద్వారా మధ్యమానేరు, దిగువమానేరు జలాశయాలను, చెరువులు, కుంటలను నింపవచ్చు. తద్వారా పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు జలఅభయం కలుగుతుంది. ఒకవేళ ఎస్సారెస్పీలోకి ఎగువనుంచి వరదనీరు రాకుంటే కాళేశ్వరం నీటిని వరదకాలువలోకి వదిలి రాంపూర్, రాజేశ్వర్‌రావుపేట పంపుహౌస్‌ల ద్వారా ఎగువకు ఎత్తిపోసే వీలుంది. వరద కాలువపై ముప్కల్ వద్దగల మూడో పంపుహౌస్‌ను నడిపిస్తే వరదకాలువలోని నీటిని ఎస్సారెస్పీలోకి ఎత్తిపోస్తే జగిత్యాల జిల్లాకు కూడా నీటిబెంగ తీరుతుంది.సాధారణ సాగుకు అవకాశం ఈ వానాకాలంలో 12.40 లక్షల ఎకరాల్లో ఆహార, 95 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగులోకి వస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ సీజన్‌లోనూ సగటు వర్షపాతం నమోదైతే 9.50 లక్షల ఎకరాలతో వరి ప్రధానపంటగా తదుపరి పత్తి, మక్క, పసుపు పంటలు ఉండనున్నాయి. చివరి ఆయకట్టుకు నీరు పారేలా కాలువలు, తూములు, డ్రాపులు తదితరాలకు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలి. ప్రాజెక్టుల నుంచి అన్ని చెరువుల్లోకి నీటిని తరలించే తూముల నిర్మాణం, వాగులపై చెక్‌డ్యాంల నిర్మాణాన్ని పూర్తిచేస్తే పరోక్షంగానూ ఆసరాగా ఉంటుంది.

# అయోమయం.. పేటలో వీధి నెంబర్లు లేక ఇక్కట్లు

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలో పలు కాలనీలకు వీధి నంబర్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. కొత్తవారు కాలనీకి వస్తే ఎటు వెళ్లాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. రోజురోజుకూ కాలనీలు విస్తరిస్తున్నా వీధులకు నంబర్లు ఏర్పాటుకు నోచుకోవడం లేదు. జిల్లా కేంద్రంలో మొత్తం 48 వార్డులు ఉన్నాయి. ఐదారు వార్డులకు నెంబర్లు ఏర్పాటుచేశారే తప్ప మిగతా వార్డులకు ఎక్కడా లేవు. ఏది కావాలన్నా ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో తెప్పించుకుంటున్నారు. ఫ్లిప్‌కార్టు, అమెజాన్ వంటి ఈ-కామర్స్ సేవలు విస్తృతమయ్యాయి. ఆహార డెలివరీలు పెరిగాయి. ఇవి ఇంటికి చేరుకొనేందుకు యాప్‌లో అడ్రస్సు నమోదు చేస్తున్నారు. కానీ వీధి నెంబరు లేకపోవడంతో డెలివరి సిబ్బంది నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. కాలనీల ఏర్పాటు సమయంలో అధికారులు వీటిని గుర్తెరగలేదు.



ఇబ్బందులిలా... సూర్యాపేటకు కొత్తవారు వస్తే సరైన చిరునామా తెలియక సతమతమవుతున్నారు. కనీసం అరగంటపాటు కాలనీల్లో తిరిగితే కానీ గమ్యానికి చేరుకోలేకపోతున్నారు. వీరికి కాలనీపేరు తెలిసినా వీధి, రోడ్డు నంబరు లేకపోవడంతో విసిగివేసారుతున్నారు. కొంతమంది చేసేది లేక బస్టాండ్‌లో దిగిన బంధువులను ద్వి చక్ర వాహనాలు, ఆటోల్లో ఇంటికి తీసుకొస్తుంటారు. ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్కరి చేతిలో చరవాణి ఉంది. దానిపై పరిజ్ఞానం ఉన్నవారు గూగుల్ మ్యాప్ ద్వారా తమ బంధువులు, స్నేహితుల ఇంటికి చేరుకుంటున్నారు. లేనివారు అడ్రస్సు తెలియక వారికి ఫోన్లు చేసి వెళ్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కాలనీలో వీధి నంబర్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఏర్పాటు చేయిస్తాం: జిల్లా కేంద్రంలో ఏయే కాలనీల్లో వీధి నెంబర్లు లేవో పరిశీలిస్తాం. ప్రతి కాలనీకి నెంబర్లు వేయించి ఇబ్బందులు లేకుండా చూస్తాం. ఇప్పటి వరకు ఈ విషయం మా దృష్టికి రాలేదు. రామాంజులరెడ్డి, మున్సిపల్ కమిషనర్, సూర్యాపేట

# పొగతో ఊపిరాడటం లేదు..!

బచ్చన్నపేట : డంపింగ్ యార్డుతో స్థానిక ప్రజల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. చెత్త నుంచి వెలువడుతున్న పొగతో ఏడాది కిందట ప్రభుత్వం చేపట్టిన బయో మైనింగ్ పనులు నిలిపివేసిన విషయం తెలిసిందే. తాజాగా కొద్ది రోజులుగా కాజీపేట మండలంలోని మడికొండ, రాంపూర్ శివారులోని డంపింగ్ యార్డు నుంచి విపరీతంగా పొగ వెలువడుతుంది. ప్రజల పాలిట ప్రమాదకరంగా మారిన డంపింగ్ యార్డు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని అక్కడి ప్రజలు ముక్తకంఠంతో కోరుకుంటున్నారు. ఈ ప్రాంత ప్రజలు శ్వాసకోశ సమస్యలతో సతమతమవుతున్నారు. విష వాయువులు పెద్ద ఎత్తున వ్యాపించి దుర్వాసనతో ఇళ్లు కనపడని విధంగా పొగ కమ్మేస్తొంది.

రోగాల బారిన ప్రజలు..

మడికొండ రైతుల నుంచి ప్రభుత్వం భూములు కొనుగోలు చేసి మడికొండ, రాంపూర్ గ్రామాల మధ్య ఎత్తైన ప్రదేశంలో 34 ఎకరాల విస్తీర్ణంలో 2013లో డంపింగ్ యార్డును ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి ఈ ప్రాంతవాసులకు సమస్యలే. చెత్తను తేవద్దని చెత్త ట్రాక్టర్లను అడ్డుకున్న సంఘటనలు ఉన్నాయి. ఆందోళన చేసిన వారిపై కేసులు పెట్టడంతో ప్రజలు వెనక్కి తగ్గారు. త్రినగరి నుంచి చెత్త తరలింపు విపరీతంగా పెరిగింది. లక్షల టన్నుల చెత్తతో అనతి కాలంలోనే గుట్టలను తలపించేలా డంపింగ్ యార్డు తయారైంది. ఈ రెండు



గ్రామాల అనారోగ్యాలకు గురవడం సమస్యకు అద్దం పడుతోంది. పాలకులు తేరుకోకుంటే భవిష్యత్తులో పెద్ద విపత్తును ఎదుర్కోవాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాలంతో సంబంధం లేకుండా చికిత్స కోసం ఇక్కడ వారు నిరంతరం దవాఖానాలకు వెళ్తారంటే అతిశయోక్తి కాదు. ఇటీవల మంటలను ఆర్పడానికి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది సైతం ఊపిరాడక పడిపోయి ఆసుపత్రుల పాలయ్యారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఊరు విడిచి వెళ్లాలనే ఆలోచనలో ఉన్నాం

శ్వాస తీసుకోలేక, దుప్పటి కప్పులేక తెల్లవారే వరకు నరకయాతన అనుభవిస్తున్నాం. ఏ రోజు ఎటు వైపు నుంచి పొగ వస్తుందోనని భయంతో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నాం. ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారంతా ఊరు విడిచి వెళ్లాలనే ఆలోచన చేస్తున్నారు. సదానందం, మాజీ సర్పంచి, రాంపూర్

ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

క్యాన్సర్, శ్వాస కోస వ్యాధులతో జనం మృతిచెందుతున్నా డంపింగ్ యార్డు ఇక్కడి నుంచి ఎత్తివేయాలనే ఆలోచన పాలకులకు రావడం లేదు. బయో మైనింగ్ చేపట్టినా అది ఎప్పుడు పూర్తి అవుతుందో లేదో తెలియని పరిస్థితి. ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.ఎదునూరి రవీందర్, మడికొండ

# సమస్యల చెంత.. వార సంత

బచ్చన్నపేట : బచ్చన్నపేటలో ప్రతి నిర్వహించే పశువులు, కూరగాయల సంతల్లో పలు సమస్యలు నెలకొనడంతో ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. సంతల ద్వారా ఏటా పంచాయతీకి రూ.లక్షల ఆదాయం సమకూరుతున్నా కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. సిద్దిపేట, భువనగిరి, లింగాలఘనపురం, చేర్యాల, నర్మెట్ట, ఆలేరు, యాదగిరిగుట్ట, నవాబుపేట్, జగదేవపూర్, జనగామ పట్టణాల నుంచి వందలాది మంది సంతకు వచ్చి పశువులు, గొర్రెల క్రయ విక్రయాలు చేస్తుంటారు. పశువుల క్రయ విక్రయాలు చేసిన వారు తప్పకుండా రహదారి రశీదులు రాయించుకోవాలి. లేకపోతే చెక్‌పోస్టుల వద్ద పశువులను పట్టుకుంటారు. రశీదులు రాసేందుకు ఏటా నిర్వహించే టెండర్లకు రూ.లక్షల ధర పలుకుతుంది. ఈ ఏడాది పశువుల సంత హక్కుల వేలాన్ని రూ.5.21 లక్షలకు అప్పగించారు. వేలం సమయంలో సంతలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పిన అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి వసతులు కల్పించలేదు. రేకుల షెడ్డు, రశీదులు రాసేందుకు గది లేవు. తాగునీరు, వినియోగదారులకు నీడ సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



కనీస సౌకర్యాలు కరవు

బచ్చన్నపేట మండలంలోని ఇటుకాలపల్లి, ఆలీంపూర్, నక్కవాని గూడెం, తమ్మడపల్లి, ఎద్దుగూడెం, సదాశివపేట, చిన్నరాంచర్ల, రామచంద్రాపూర్, కొన్నె, బసిరెడ్డిపల్లి తదితర గ్రామాల ప్రజలు వివిధ వస్తువులు, కూరగాయలు కొనేందుకు కూరగాయల సంతకు వస్తుంటారు. సంతకు వేలం నిర్వహించగా పంచాయతీకి రూ.3.5 లక్షల ఆదాయం వచ్చింది. సంతలో మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. మహిళల పరిస్థితి దయనీయంగా ఉంటోంది. వ్యాపారులు ప్రధాన రహదారికి ఇరువైపులా కూర్చొని కూరగాయలు, ఇతర వస్తువులను విక్రయిస్తుండడంతో భారీ వాహనాల రాకపోకలకు ఆటంకమేర్పడుతోంది.

వర్షం కురిస్తే ఇబ్బందే – అలువాల ప్రశాంత్, బచ్చన్నపేట

సంతకు ప్రత్యేకమైన స్థలం లేకపోవడంతో బచ్చన్నపేట నుంచి ఆలేరుకు వెళ్లే దారిలో ప్రధాన రహదారికి ఇరువైపులా కొనసాగుతోంది. వర్షం కురిసినప్పుడు కొనుగోలుదారులు, అమ్మకందారులు ఇబ్బందులు పడుతున్నారు. పరిసర గ్రామాల నుంచి సంతకు వచ్చే ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంటోంది. ప్రభుత్వం దృష్టి సారించి సంతకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించి షెడ్లు నిర్మించాలి. మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి సౌకర్యాలు కల్పించాలి.

ప్రతిపాదనలు పంపిస్తాం

బచ్చన్నపేట మండల కేంద్రంలో కూరగాయల మార్కెట్, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. అనుమతులు రాగానే పనులు చేపడతాం. ఎంపీడీవో రఘురామకృష్ణ

# ఏళ్ల కల.. నెరవేరుతున్న వేళ




ఖమ్మం: అటవీ భూములను నమ్ముకుని దశాబ్దాలుగా జీవనం సాగిస్తున్న పోడు సాగుదారుల కల ఎట్టకేలకు నెరవేరబోతోంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్ పలువురు లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేయనున్నారు. ఉభయ జిల్లాల్లో 57,184 మంది పోడు సాగుదారులకు 1,64,332.23 ఎకరాల హక్కు పత్రాలు దక్కనున్నాయి. వారం వ్యవధిలో ప్రక్రియను పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఉభయ జిల్లాల్లో మంత్రుల పర్యటన

హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో నేరుగా భద్రాద్రి జిల్లా పాల్వంచకు మంత్రి హరీశ్‌రావు చేరుకుంటారు. అక్కడి నుంచి సుగుణ ఫంక్షన్ హాల్‌కు చేరుకుంటారు. మంత్రి పువ్వాడ అజయ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పోడు హక్కు పత్రాలు అందజేస్తారు. అనంతరం హెలికాప్టర్‌లో ఖమ్మం చేరుకుంటారు. సర్వజన ఆసుపత్రి, వైద్య కళాశాలను పరిశీలిస్తారు. భక్తరామదాసు కళాక్షేత్రంలో పువ్వాడతో కలిసి పోడు పట్టాలు పంపిణీ చేస్తారు. ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు పట్టాలు అందజేస్తుండటంపై సాగుదారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

పినపాక నియోజకవర్గంలో అత్యధికం భద్రాద్రి జిల్లాలో 5 నియోజకవర్గాల్లోని 717 గ్రామాల్లో 50,595 మంది రైతులకు 1,51,195.00 ఎకరాల హక్కు పత్రాలు అందజేయనున్నారు. పినపాక నియోజకవర్గంలో 15,962 మంది రైతులు 52,438.39 ఎకరాలు, ఇల్లెందు నియోజకవర్గంలో 12,347 మంది అన్నదాతలు- 36,528.37 ఎకరాలు, అశ్వారావుపేట నియోజకవర్గంలో 9,418 మంది కర్షకులు- 25,817.15 ఎకరాలు, భద్రాచలం నియోజకవర్గంలో 6,515మంది రైతులు- 16,211.02 ఎకరాలు, కొత్తగూడెం నియోజకవర్గంలో 4,541 మంది అన్నదాతలు- 15,311.27 ఎకరాల పోడు పట్టాలు అందుకోబోతున్నారు.వైరా నియోజకవర్గం జూలూరుపాడు మండలంలో 1,812 మందికి 4,826.40 ఎకరాల పోడు పట్టాలు పంపిణీ చేయనున్నారు.

# సమున్నత లక్ష్యం.. ఫలితాలు శ్రేష్ఠం




ఖమ్మం: గిరిజన ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యను చేరువ చేసే లక్ష్యంతో ప్రభుత్వం మోడల్ గురుకులాలు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఏర్పాటైన పాల్వంచ మండలం కిన్నెరసానిలోని కళాశాలను 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీవోఈ)'గా అప్‌గ్రేడ్ చేశారు. ఐఐటీ, ప్రతిష్ఠాత్మక వర్సిటీల్లో ప్రవేశాలు సాధించే స్థాయిలో విద్యార్థులను తీర్చిదిద్దేందుకు బోధనా వసతులు, మెటీరియల్ సమకూర్చారు. ఫలితంగా ఈ ఏడాది జూన్‌లో జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో కిన్నెరసాని సీవోఈ నుంచి ఐదుగురు విద్యార్థులు ఎస్టీ కేటగిరీలో మంచి ర్యాంకులు దక్కించుకున్నారు. 'ఐటీడీఏ సహకారంతో జేఈఈ ప్రవేశ పరీక్షల స్టడీ మెటీరియల్, బోధనోపకరణాలు సమకూర్చుకున్నాం. పిల్లలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాం. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల సలహాలు, నమూనా టెస్టులు ర్యాంకులు సాధించేలా చేశాయని' ప్రిన్సిపల్ రవికుమార్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ప్రస్తుతం ప్రవేశాల కౌన్సెలింగ్ (జోసా మాక్ టెస్ట్ ట్రయల్)కు హాజరవుతున్న విజేత విద్యార్థులను పలుకరించగా ర్యాంకుల సాధనకు చేసిన కృషి, జీవిత లక్ష్యాల విశేషాలు ఇలా వెల్లడించారు.

జాతీయ స్థాయి పరీక్షలో మంచి ర్యాంకు సాధిస్తే జీవితమే మారిపోతుందని అధ్యాపకులు, ప్రిన్సిపల్ ప్రోత్సహించారు. వారి సూచనలు పాటిస్తూ జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు సిద్ధమయ్యా. 1,428 ర్యాంకు సాధించడం సంతోషంగా ఉంది. జోసా (జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ) ఆప్షన్‌తో ప్రతిష్ఠాత్మక ఐఐటీ తదితర సంస్థలతో పాటు కేంద్రీయ విశ్వ విద్యాలయాల్లో ప్రవేశాలకు అవకాశం ఉంది. ప్రాధాన్యం ప్రకారం సీట్లు కేటాయిస్తారు. కోర్సుల నచ్చితే తుదపరి దశ కౌన్సెలింగ్ (మాక్ టెస్ట్ ట్రయల్)కు వెళ్లకుండా ప్రవేశాలు పొందొచ్చు. ఇలా మొత్తం మాక్ టెస్ట్ ట్రయల్స్ ఆరుసార్లు నిర్వహిస్తారు. ప్రస్తుతం ట్రయల్–1లో వారణాసి సెంట్రల్ యూనివర్సిటీలో ఫార్మాస్యూటికల్ ఇంజినీరింగ్‌లో ప్రవేశం లభించింది. మైనింగ్ ఇంజినీరింగ్ చేయాలన్నదే నా లక్ష్యం. బానోత్ చందు, నర్సంపేట, వరంగల్

ఇంటర్ ఎంపీసీలో 950 మార్కులు సాధించా. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 905 ర్యాంకు లభించింది. రోజుకు ఎనిమిది గంటలు కష్టపడ్డా. భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు మోహన్ తెలిపిన బోధనా మెలకువలు ఎంతో తోడ్పడ్డాయి. తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చేందుకు ఉన్నత చదువులు చదవాలని లక్ష్యంగా పెట్టుకున్నా. వారికి, విద్యాలయానికి మంచిపేరు తేవాలన్నదే నా ఆశయం. ప్రస్తుతం జరిగిన మాక్ టెస్ట్‌లో ఏ సీటునూ ఎంచుకోలేదు. కంప్యూటర్ ఇంజినీరింగ్‌లో మంచి విద్యా సంస్థలో ప్రవేశం పొందాలనుకుంటున్నా. ఉపాధ్యాయులు చెప్పిన సిలబస్‌ను ప్రతిరోజు అనుచరిస్తూ.. ప్రణాళికాబద్ధంగా చదివితే ప్రభుత్వ విద్యార్థులకు మంచి ర్యాంకు సులభమే. సల్మాన్, చిన్నబంజర తండా, గార్ల మండలం, మహబూబాబాద్ జిల్లా

కిన్నెరసాని గిరిజన గురుకులంలో ఇంటర్మీడియట్ పూర్తి చేశా. ఎంపీసీలో 960 మార్కులొచ్చాయి. గ్రంథాలయానికి పోటీ, ప్రవేశ పరీక్షల పుస్తకాలను తెప్పించిన ప్రిన్సిపల్.. జేఈఈ, అడ్వాన్స్‌డ్‌కు ప్రత్యేక సన్నద్ధత చేయించారు. ఉపాధ్యాయులు సరళంగా సబ్జెక్టులు బోధించిన తీరు బాగుంది. నిరంతర సాధనతో అడ్వాన్స్‌డ్‌లో 4,731 ర్యాంకు సాధించా. మాక్ టెస్ట్–1లో మణిపూర్ సెంట్రల్ వర్సిటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ సీటు లభించింది. మా నాన్న లేకున్నా అమ్మ కష్టపడి చదివిస్తోంది. ఆమె కోసం ఐఏఎస్ అవుతా. ప్రభుకుమార్, డోర్నకల్, మహబూబాబాద్ జిల్లా

మారుమూల ప్రాంతం నుంచి వచ్చిన నేను బోధనా సిబ్బంది సహకారంతో అడ్వాన్స్‌డ్‌లో 2,183 ర్యాంక్ సాధించడం సంతోషంగా ఉంది. మంచి వర్సిటీలో సీటు దక్కించుకుంటాను. మారుమూల విద్యాలయంలో చదువుకున్నా సరే.. మంచి ర్యాంక్ సాధించాలంటే సబ్జెక్టులపై పూర్తి అవగాహనతో పాటు, ఉపాధ్యాయుల సూచనలు పాటించాలి. మాక్ టెస్ట్‌లలో లోపాలు సవరించుకోవాలి. కష్టపడితే మంచి సీటు సాధ్యమే. అరవింద్‌కుమార్, సుజాతనగర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

ఎంపీసీలో 933 మార్కులు సాధించగా.. అడ్వాన్స్‌డ్‌లో 1,286 ర్యాంకు లభించింది. ఉత్తమ ర్యాంకు సాధనకు పట్టుదలతో చదివా. మాక్ టెస్ట్–1లో సీటు ఎంపిక చేసుకోలేదు. ఏదైనా ప్రముఖ వర్సిటీలో ప్రవేశం తప్పక లభిస్తుంది. సివిల్ ఇంజినీరింగ్ బ్రాంచ్ ఎంచుకుంటా. సీవోఈలో 'మైక్రో షెడ్యూల్' అనుసరించడంతో పాటు ప్రణాళికాబద్ధంగా జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు సన్నద్ధమయ్యా. పాఠ్యాంశాలు శ్రద్ధగా వింటూ.. ప్రతిరోజు నిర్వహించే నమూనా పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించేందుకు ప్రయత్నించా. ఇదే సమయంలో ఎప్పటి సందేహాలు అప్పుడే ఉపాధ్యాయులతో నివృత్తి చేయించుకున్నా. భవిష్యత్తులో ఉన్నత స్థానంలో నిలిచి తల్లిదండ్రులకు ఆర్థిక ఆసరాగా నిలవాలన్నదే నా లక్ష్యం. జె.సందీప్, బోరింగ్‌తండా, లక్ష్మీదేవిపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

# నత్తనడకన మరమ్మతులు.. 'దారి'కి రాని నిధులు

మహబూబాబాద్ : వెంకటాపురం, వాజేడు మండలాల పరిధిలో విస్తరించి ఉన్న చంద్రుపట్ల–భద్రాచలం ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వాన్నంగా తయారైంది. గుంతలతో ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. తారుదారి మరమ్మతులకు రూ.కోట్ల నిధులు మంజూరైనా.. ఆధునికీకరణ నత్తనడకన కొనసాగుతుండటంతో ఆరు నెలలైనా దారి బాగుపడని దైన్య స్థితి. మరమ్మతులు చేపట్టిన గుత్తేదారు అర్ధాంతరంగా మధ్యలోనే పనులను వదిలేయడంతో ప్రయాణికులు, ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోంది.

సగం పనులతో ఆగమాగం జగన్నాధపురం వై.జంక్షన్ నుంచి ఎదిరగుట్టల వరకు 48 కి.మీ తారుదారిని బాగు చేసేందుకు ప్రభుత్వం రూ.23.80 కోట్ల నిధులను కేటాయించింది. ఐదు బిట్లుగా విభజించిన ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు పలువురు గుత్తేదారులకు ఆధునికీకరణ పనులు అప్పగించారు. నత్తతో పోటీ పడుతూ.. వస్తున్న ఈ పనుల్లో గుత్తేదారు నాణ్యతను విస్మరించారు. ప్రగళ్లపల్లి, వై.జంక్షన్, చిరుతపల్లి, నూగూరు మూలమలులు ప్రాంతాల్లో తారు తొలగిపోవడంతో మళ్లీ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. ఆ పనులు సైతం అసంపూర్తిగానే వదిలేశారు. ప్రజాప్రతినిధుల ఒత్తిడి, ప్రజల నిరసనలతో వెంకటాపురం మండల కేంద్రం వరకు ఈ పనులు చేపట్టారు.అమ్మో.. గుంతల్లో నరకం

వెంకటాపురం నుంచి ఎదిరగుట్టల వరకు మరమ్మతు పనులు పూర్తి కాలేదు. పట్టణ శివారులోని కంకలవాగు వారధి, ఉప్పేడు గొల్లగూడెం, టేకులబోరు, వీరభద్రవరం, పాలెం, అబ్బాయిగూడెం, ఎదిర ప్రాంతాల్లో పెద్ద గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు కష్టంగా మారింది. ఇటీవల కురిసిన చిన్న వర్షాలకు నీరు చేరి ప్రమాదకరంగా తయారయ్యాయి. కొత్తగా వచ్చే వాహనదారులు ఆ దారుల్లో ప్రయాణిస్తే ప్రమాదంలో చిక్కుకోవాల్సిన పరిస్థితి. పలు వాహనాలు గుంతల్లో పడి టైర్లు పేలిన సందర్భాలున్నాయి. నిధులు నిరుపయోగం కాకుండా రోడ్డు బాగు చేయాలని ఏజెన్సీ వాసులు కోరుతున్నారు.

# దోచేస్తున్నారు..!

మహబూబాబాద్ : జిల్లాలో వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. విలాసాలకు అలవాటు పడిన దుండగులు సులువుగా డబ్బు సంపాదించడం కోసం తరచూ దొంగతనాలకు పాల్పడుతూ దోచేస్తున్నారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లు, ప్రభుత్వ ఆసుపత్రులను, బ్యాంక్‌లను సైతం విడవకుండా గుట్టుచప్పుడు కాకుండా చొరబడి వస్తువులు, అభరణాలు, నగదును దోచుకుంటున్నారు. పోలీసులు పటిష్ఠమైన నిఘా ఏర్పాటు చేసినప్పటికీ వారి కళ్లుగప్పి దోపిడీలు కొనసాగిస్తున్నారు. జిల్లాలో ఏదో ఒక చోట జరుగుతున్న దోపిడీలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల మహబూబాబాద్ పట్టణంతోపాటు బయ్యారం, గార్ల, గంగారం, సీరోలు, తొర్రూరు, దంతాలపల్లి, కురవి తదితర మండలాల్లో దొంగతనాల ఘటనలు చోటుచేసుకున్నాయి.

ఆరు నెలల్లో ఐదు చోరీలు

బయ్యారం మండలంలో జనవరి నుంచి ఇప్పటి వరకు ఐదు ఘటనలు జరిగాయి. జనవరి 25న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఇంట్లో 10 తులాల బంగారు అభరణాలను అపహరించారు. ఫిబ్రవరిలో మరో ప్రభుత్వ ఉద్యోగిని ఇంట్లో సుమారు రూ.5లక్షల విలువైన బంగారు నగలను పట్టపగలే దోచుకెళ్లారు. డిసెంబర్‌లో లక్ష్మీనర్సింహాపురంలో ఇంట్లోని బీరువాను వ్యవసాయ భూముల్లోకి తీసుకెళ్లి అభరణాలు ఎత్తుకెళ్లారు. ఏప్రిల్‌లో జిల్లాలోని పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో



బ్యాటరీలు, కంప్యూటర్లు చోరీకి గురయ్యాయి. ఈనెల 7న, బస్టాండ్ కూడలిలో నాగు ఇంటి ముందు పార్కింగ్‌చేసిన ద్విచక్రవాహనాన్ని ఎత్తుకుపోయారు. ఏకంగా ఎస్‌బీఐలో చోరీకి ప్రయత్నించడం మండలంలో కలకలం సృష్టించింది.

పోలీసుల నిఘా పెంచాలి

ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేయాలి.

దొంగతనాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో నిఘా పెంచాలి.

రాత్రి సమయంలో పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్ఠం చేయాలి.

జిల్లా కేంద్రం సహా ముఖ్య పట్టణాల్లో పోలీసు గస్తీ పెంచాలి.

జిల్లాలో 2022లో జరిగిన సంఘటనలు కొన్ని

మహబూబాబాద్ పట్టణంలోని సర్వేపల్లి రాధాకృష్ణ కాలనీలో అక్టోబర్ 17 రాత్రి కాసెట్టి లక్ష్మణ్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి ఐదు తులాల బంగారు ఆభరణాలు, కిలో వెండి, నగదు రూ.60 వేలు అపహరించారు. శ్రీరాంభద్రన్న కాలనీలో అక్టోబరు 6వ తేదీన లూనావత్ వంశీ ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న నాలుగుతులాల బంగారు ఆభరణాలు,.రూ.50 వేల నగదు అపహరణకు గురయ్యాయి.

ఈదులపూసపల్లి రోడ్డు సమీపంలోని ఎస్వీ గురుకుల పాఠశాలలో సెప్టెంబర్ 14 రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ. 13.60 లక్షల విలువైన 17 లాప్‌ట్యాప్‌లు, రూ. 20 వేల విలువైన చరవాణిని అపరించారు. జులై 25న మల్యాల శివారు పెద్దరామోజీ తండాకు చెందిన రైతు భూక్య శ్రీను ద్విచక్రవాహనంలోంచి నలుగురు దుండగులు పట్టపగలే రూ 4 లక్షలు అపహరించారు.

# నెరవేరనున్న దశాబ్దపు కల

వరంగల్ : ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల దశాబ్దకాలపు కల నెరవేరుతోంది. హనుమకొండ జిల్లా కాజీపేట మండలం అయోధ్యపురం వద్ద 160 ఎకరాల్లో రైల్వే వ్యాగన్ తయారీ, పిరియాడికల్ ఓవర్‌హాలింగ్ (పీఓహెచ్) షెడ్ నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా జులై 8న శంకుస్థాపన జరగనుంది. పవర్‌మెట్, టికియా అనే రెండు రైల్వే నిర్మాణ సంస్థలు రూ.300 కోట్లతో సివిల్ పనులు చేస్తున్నాయి. ఇప్పటికే 160 ఎకరాల చుట్టూ ప్రహరీ నిర్మాణం పూర్తయింది. తాత్కాలిక కార్యాలయాలను ఏర్పాటు చేశారు. 550 రన్నింగ్ మీటర్ల పొడవుతో పెద్ద షెడ్ నిర్మాణానికి పనులు జరుగుతున్నాయి. కాజీపేట నుంచి అయోధ్యపురం మీదుగా పరిశ్రమల నిర్మాణ స్థలానికి రైలు పట్టాలు వేయడానికి సైతం పనులు జరుగుతున్నాయి. రెండు సంవత్సరాల్లో షెడ్ నిర్మాణం పూర్తవుతుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.స్థలం రాష్ట్ర ప్రభుత్వానిది.. నిర్మాణం కేంద్రానిది..: 2010 బడ్జెట్‌లో అప్పటి రైల్వే మంత్రి మమతా బెనర్జీ సికింద్రాబాద్‌కు వ్యాగన్ రిపేర్ వర్క్‌షాపును మంజూరు చేశారు. స్థలం లభించనందున ఇతర ప్రాంతాలకు తరలిస్తారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కాజీపేటలోని అయోధ్యపురం వద్ద గల మడికొండ మెట్టుగుట్ట శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయానికి సంబంధించిన దేవాదాయ భూములు ఖాళీగా ఉన్నాయనే విషయం తెలుసుకుని 2012లో కాజీపేటకు అవకాశం ఇచ్చారు. దేవాదాయశాఖ భూములు రాష్ట్ర ప్రభుత్వం సేకరించి ఇవ్వాలంటే కోర్టు అనుమతి తప్పనిసరి కావడంతో సమయం పట్టింది. ఎట్టకేలకు భూమి సేకరణ పూర్తిచేసి రాష్ట్ర ప్రభుత్వం రైల్వేకు అప్పగించడంతో రైల్వే శాఖ టెండర్లు పిలిచి పనులను ప్రారంభించింది.

మొదటి విడతలో రూ.521 కోట్లతో వ్యాగన్ పరిశ్రమ నిర్మాణం జరుగుతుంది. మొత్తం రూ.1000 కోట్లతో పూర్తవుతుందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ పరిశ్రమ రావడం వల్ల కాజీపేటకు 3000 మంది ఉద్యోగులు వస్తారని అవుట్‌సోర్సింగ్‌లతో కలుపుకొంటే 5000 మంది వరకు పనిచేసే అవకాశం ఉందని చెప్పారు. కాజీపేట చుట్టు పక్కల ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు.

కోచ్‌ల స్థానంలో వ్యాగన్..

పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీని సైతం మంజూరు చేశారు. పంజాబ్‌లో అల్లర్ల కారణంగా అక్కడి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో దీన్ని అక్కడికి తరలించారు. ప్రస్తుతం దేశంలో కోచ్‌లు సరిపోయినన్ని ఉన్నాయని.. వ్యాగన్‌లకు డిమాండ్ ఉన్న కారణంగా కోచ్ ఫ్యాక్టరీ స్థానంలో వ్యాగన్ పరిశ్రమ, దీనికి అదనంగా పీఓహెచ్‌ను కూడా నిర్మిస్తున్నామని ఇటీవల సికింద్రాబాద్‌లో రైల్వే మంత్రి పియూష్‌గోయెల్ ప్రకటించారు.




దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నివాసం వద్ద ఓ డ్రోన్ కలకలం రేపింది. సోమవారం తెల్లవారుజామున 5.30 గంటల ప్రాంతంలో ఓ అనుమానాస్పద డ్రోన్ ప్రధాని నివాసంపై సంచరించినట్లు ఎస్పీజీ (స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్) నుంచి సమాచారం అందిందని దిల్లీ పోలీసులు వెల్లడించారు.

ప్రస్తుతం దీనిపై దర్యాప్తు చేస్తున్నారు. దిల్లీలోని లోక్ కల్యాణ్ మార్గ్‌లో ప్రధాని అధికారిక నివాసం ఉంది. సాధారణంగా ప్రధాని నివాసం వద్ద నో-ఫ్లై జోన్ అమల్లో ఉంటుంది. అలాంటి ప్రాంతంలోకి డ్రోన్ రావడంతో భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. దీంతో దిల్లీ పోలీసులు, భద్రతా సిబ్బంది రంగంలోకి దిగి డ్రోన్‌ను ట్రాక్ చేసేందుకు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. అయితే ఇప్పటివరకు అనుమానాస్పదంగా ఏదీ కన్పించలేదని తెలుస్తోంది. "ప్రధాని నివాసం పరిసర ప్రాంతాల్లో ముమ్మర గాలింపు చేపట్టారు. ఇప్పటివరకు ఎలాంటి డ్రోన్ తరహా వస్తువు కన్పించలేదు.

ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ రూంను కూడా సంప్రదించాం. ప్రధాని నివాసం వద్ద ఎలాంటి ఎగిరే వస్తువును గుర్తించలేదని వారు చెప్పారు" అని దిల్లీ పోలీసులు ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసం వద్ద కూడా ఓ అనుమానాస్పద డ్రోన్ సంచరించినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. కేజ్రీవాల్ నివాసం కూడా నో-ఫ్లై జోన్‌లోనే ఉంది.




తాడిపత్రి: అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణ సీఐ ఆనందరావు (52) ఆత్మహత్య చేసుకున్నారు.

సోమవారం తెల్లవారుజామున ఇంట్లోనే ఆయన బలవన్మరణానికి పాల్పడ్డారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గత 9 నెలలుగా ఆనందరావు తాడిపత్రి సీఐగా విధులు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని సీపీఐ కాలనీలోని అద్దె ఇంట్లో ఆయన కుటుంబం నివాసముంటోంది. గత కొన్ని రోజులుగా భార్య అనురాధతో సీఐకు గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి కూడా వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో కుటుంబసభ్యులు నిద్రపోయిన తర్వాత ఇంట్లోనే సీఐ ఉరివేసుకున్నారు. గత మూడునెలలుగా పని ఒత్తిడితో తీవ్ర ఇబ్బందులు పడేవారని కుటుంబసభ్యులు తెలిపారు. సీఐ ఆనందరావు గత ఏడాది సెప్టెంబర్‌లో కడప నుంచి తాడిపత్రికి బదిలీపై వచ్చారు. ఆయన స్వగ్రామం చిత్తూరు జిల్లా చంద్రగిరి. సీఐకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆనందరావు ఆత్మహత్య విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు.

ఆత్మహత్యకు గలకారణాలపై విచారిస్తున్నారు. సీఐ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పరామర్శించారు.

# ఏపీలో రసాభాసగా మారిన సర్పంచ్‌ల ముట్టడి..



అమరావతి: ఏపీలో సర్పంచ్‌ల ముట్టడి కార్యక్రమం రసాభాసగా మారింది. ఏపీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ కమిషనరేట్ ముట్టడి పిలుపునివ్వగా... ఒక్కసారిగా సర్పంచ్‌లు వందలాది మంది పంచాయతీరాజ్ కమిషనరేట్ వైపు దూసుకొచ్చారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వచ్చిన వారిని వచ్చినట్టు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. పోలీసులు.. సర్పంచులను ఎత్తి వెహికల్స్‌లోకి ఎక్కించారు. 15 ఆర్థిక సంఘం నిధులు వచ్చి 40 రోజులు అవుతున్నా నేటికీ విడుదల కాకపోవడంపై సర్పంచులు ఆందోళనకు దిగారు. తాము కూడా ముఖ్యమంత్రి జగన్‌లాగా ప్రజలు ఎన్నుకుంటేనే గెలిచామని... మీరంతా పార్టీ గుర్తుపై గెలిస్తే మేం మాత్రమే ప్రజల ఆమోదంతో గెలిచామని చెప్పుకొచ్చారు. రాత్రి అయితే సర్పంచ్‌లకు నిద్ర ఉండటం లేదని, నెలల తరబడి గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు పెండింగ్లు ఉంటున్నాయని తెలిపారు. నిద్ర పట్టక మాత్రలు వేసుకున్నా ఫలితం ఉండడం లేదన్నారు. తక్షణం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.691 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలు సర్పంచ్‌ల ఆధీనంలో గ్రామ సచివాలయాల కార్యకలాపాలు జరగాలన్నారు. సర్పంచుల గౌరవ వేతనాన్ని రూ.3000 నుంచి రూ.15 వేలుకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే మైనర్ పంచాయతీల కరెంట్ బిల్లులు తాగునీటి సరఫరా వీధిలైట్లు పూర్తి బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలన్నారు. గ్రామ సచివాలయాలపై వచ్చే ఆదాయాన్ని పంచాయతీల ఖాతాల్లోనే వేయాలని పట్టుబట్టారు. గిరిజన తండాలకు ప్రత్యేకంగా పరిగణించి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలన్నారు. గ్రామపంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్ జీతాలు రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని సర్పంచ్‌లు డిమాండ్ చేశారు.




# రాజకీయ ఒత్తిళ్ల తోనే సీఐ బలవన్మరణం: జేసీ ప్రభాకర్ రెడ్డి

**గత ఐదు నెలలుగా స్థానిక ఎమ్మెల్యే ఒత్తిడి తేవడంతోనే సీఐ ఆనందరావు ఆత్మహత్యకు పాల్పడ్డారని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. ఏ ప్రాంతంలోనూ లేని విధంగా తాడిపత్రిలో పోలీసులపై రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని ఆయన చెప్పారు. రాజకీయ ఒత్తిళ్లతోనే సీఐ ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆరోపించారు. మరోవైపు సీఐ బలవన్మరణంపై స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి స్పందించారు. రాజకీయ ఒత్తిడి కారణంగా సీఐ చనిపోయినట్లు నిరూపిస్తే.. తాను ఏ చర్యకైనా సిద్ధమని తెలిపారు.**

# ఈనెల 28న ఛలో ఢిల్లీకి బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పిలుపు



విజయవాడ: నీళ్లు, నిధులు, నియామకాల్లో సమాన వాటా కోసం పోరాటం కోసం ఈనెల 28న ఛలో ఢిల్లీకి రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఛైర్మన్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌పై బైరెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. గతంలో కర్నూలు రాజధానిగా పెట్టి మళ్లీ హైదరాబాద్ తరలించారని... ఇప్పుడు ఈ సీఎం జగన్ న్యాయ రాజధాని పెడతామంటున్నారన్నారు. ఇంతకంటే అన్యాయం మరొకటి లేదని మండిపడ్డారు. రాయలసీమ నాయకులు తమ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేశారన్నారు. తమ దగ్గర ఉన్న ఖనిజ సంపద మరెక్కడా లేదని.. ఐరన్ ఓర్, బరైటీస్, మైనింగ్ కొల్లగొట్టుకుపోతున్నారని విమర్శించారు. రాయలసీమ అంటే పెట్టుబడులు పెట్టే వారు రావడం లేదన్నారు. సినిమాల్లో తమ ప్రాంతం వాళ్లను రౌడీలు, కబ్జా కోరులుగా చూపించి సొమ్ము చేసుకుంటున్నారని మండిపడ్డారు. రాయలసీమ విషయంలో కేంద్రం, రాష్ట్రం కళ్లు తెరవాలని హితవుపలికారు. జగన్మోహన్ రెడ్డి స్పందించి మోడీపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఒక్క ఛాన్స్ అని ఓటు వేయించుకున్న జగన్మోహన్ రెడ్డి రాయలసీమకు ఏమీ చేయలేదని విమర్శించారు. "మా ప్రాంతానికి మీరు ఏం చేశారో చెప్పాలని జగన్‌ను అడుగుతున్నా. మాకు అత్యంత అన్యాయం జగన్ సిఎం అయ్యాకే జరిగింది. అప్పర్ భద్ర ప్రాజెక్టు 26వేల కోట్లతో కడుతున్నారు. కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు నీరు వచ్చే పరిస్థితి ఉండదు. అప్పర్ భద్ర వల్ల రాయలసీమ నాశనం అవుతుందని జగన్ కేంద్రానికి ఎందుకు చెప్పలేదు. ఎందుకూ పనికి రాని కేబుల్ బ్రిడ్జి ఎందుకు... సెల్ఫీలు దిగడానికా. సీఎంకు లేఖలు రాసినా పట్టించుకోరు, వినిపించుకోరు. జగన్ చెవిలో సీసం పోసుకున్నారు కాబట్టి సేవ్ రాయలసీమ పేరుతో పోరాటం చేస్తాం. మా రాయలసీమ హక్కుల కోసం జులై 28న ఛలో ఢిల్లీకి పిలుపునిచ్చాం" అని ఆయన వెల్లడించారు.




విశాఖపట్నం: సింహాచలం గిరిప్రదక్షిణ రెండోరోజు కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం ప్రారంభమైన గిరిప్రదక్షిణకు సోమవారం ఉదయానికి పెద్ద సంఖ్యలో భక్తజనం తరలివచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఉభయగోదావరి, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో గిరి ప్రదక్షిణ మార్గాలు కిక్కిరిసిపోయి గోవింద నామస్మరణతో మార్మోగుతున్నాయి. సోమవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో పాతగోశాల టీ జంక్షన్ వద్ద రద్దీ జనసంద్రాన్ని తలపించింది. ఆ మార్గంలో కనుచూపు మేరలో ఇసుకేస్తే రాలనంతంగా భక్తులు కనిపించారు. అప్పన్నస్వామిని స్మరించుకుంటూ ముందుకు సాగుతున్నారు

# ఆ మీడియా, దాని యాజమాన్యానికి ప్రతిదీ క్విడ్ ప్రోకోగానే కనిపిస్తుంది..




విజయవాడ: లింగమనేని గెస్ట్ హౌస్ అటాచ్ మెంట్‌పై ఏసీబీ కోర్టు తీర్పుకు సీఎం జగన్ రెడ్డి, అతని అవినీతి మీడియా వక్ర భాష్యాలు చెబుతోందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ పచ్చకామెర్లవాడికి లోకమంతా పచ్చగా కనిపించినట్టు, క్విడ్ ప్రోకో నుంచి పుట్టిన సాక్షిమీడియాకు, దాని యాజమాన్యానికి ప్రతిదీ క్విడ్ ప్రోకోగానే కనిపిస్తుందన్నారు. రాజధానిలో క్విడ్ ప్రోకో అని గతంలో జగన్ విషప్రచారం చేశారని, ముఖ్యమంత్రి అయ్యాక ఎలాంటి విచారణ జరపకుండా తేలుకుట్టిన దొంగలా ఉండిపోయారన్నారు. గతంలో అధికారం కోసం రాజధానిలో 5 లక్షల కోట్ల విలువైన భూములు కొట్టేశారన్న జగన్ రెడ్డి, 4 ఏళ్లలో దానిపై ఎందుకు విచారణ జరిపించలేదని ప్రశ్నించారు. విష ప్రచారం చేయడం.. ప్రజల మెదళ్లలో విషబీజాలు నాటి పబ్బం గడుపుకోవడం జగన్ రెడ్డికి అవినీతితో అబ్బిన విద్యని బోండా ఉమా అన్నారు.

2005లో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం లింగమనేని గెస్ట్ హౌస్ నిర్మాణానికి అనుమతిచ్చిందని, ఆనాడు అది సక్రమకట్టడమేనని ఉడా విభాగం తేల్చిందన్నారు. 2020లో జగన్ రెడ్డికి మాత్రం అది అక్రమకట్టడంగా కనిపించిందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు నివాసముంటున్న లింగమనేని గెస్ట్ హౌస్ ఒక్కటే జగన్‌కు, అతని ప్రభుత్వానికి అక్రమకట్టడంగా కనిపించడం పైశాచికత్వంకాక మరేమిటని ప్రశ్నించారు. అదే కరకట్టపై ఉన్న ఆశ్రమాలు, ఇస్కాన్ మందిరాలు, ప్రకృతి వైద్యశాలలు, ఇతరత్రా కట్టడాలు ఏవీ జగన్ రెడ్డికి అక్రమకట్టడాలుగా కనిపించలేదా? అంటూ నిలదీశారు. లింగమనేని గెస్ట్ హౌస్ చంద్రబాబు సొంత ఆస్తికాదని, గత ప్రభుత్వం దాన్ని ఆయన అధికారిక నివాసంగా కేటాయించిందన్నారు. ప్రభుత్వం ముఖ్యమంత్రులకు, ప్రతిపక్షనేతలకు అధికారిక నివాసాలు కేటాయించడం ఎప్పటి నుంచో వస్తున్న సాంప్రదాయమేనని అన్నారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జగన్ (ప్రతిపక్షనేత) కోరినట్టు, లోటస్ పాండ్ భవనాన్ని ఆయన అధికారిక నివాసంగా గుర్తించిన విషయాన్ని ఈ సందర్భంగా బోండా ఉమా గుర్తు చేశారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రభుత్వ పరంగా నేటికీ చంద్రబాబుకు అధికారిక నివాసం కేటాయించలేదని విమర్శించారు. ఉంటున్నదాన్నే అక్రమకట్టడమని, కూల్చేస్తామని బెదిరిస్తున్నారన్నారు. జగన్ రెడ్డి గతంలో చంద్రబాబు రూ.6 లక్షల కోట్లు మింగేశారని ఎంపరర్ ఆఫ్ కరెప్షన్ పేరుతో తప్పుడు సమాచారంతో పుస్తకాలు ముద్రించారని, ముఖ్యమంత్రి అయ్యాక ఒక్కరోజు కూడా దానిపై మాట్లాడలేదని దుయ్యబట్టారు. జగన్ విషప్రచారంలో సిద్ధహస్తుడని ప్రజలకు బాగా అర్థమైందన్నారు. అధికార మదంతో జగన్ చేసే ప్రతిపని, మాట్లాడే ప్రతిమాటకు టీడీపీ ప్రభుత్వం రాగానే ఇంతకింత బదులిస్తామని బోండా ఉమా హెచ్చరించారు.

# నేడు చిత్తూరుకు సీఎం వైయస్ జగన్

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పెద్దిరెడ్డి



చిత్తూరు: ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తూరు జిల్లా పర్యటన ఏర్పాట్లను విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం పరిశీలించారు. సభా వేదిక, డెయిరీ ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. చిత్తూరు జిల్లాలోని పాడి రైతులకు మేలు చేసేందుకు మూతపడిన విజయా (చిత్తూరు) డెయిరీని అమూల్ ఆధ్వర్యంలో పునఃప్రారంభించనున్నట్లు తెలిపారు. చిత్తూరు డెయిరీ ప్రారంభించిన అనంతరం చీలాపల్లి సీఎంసీలో 300 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులకు సీఎం వైయస్ జగన్ శంకుస్థాపన చేయనున్నారని వివరించారు. వచ్చే సీజన్‌కు గవర్నమెంట్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను అందుబాటులోకి తెస్తామని మంత్రి పెద్దిరెడ్డి వివరించారు. గత ప్రభుత్వంలో రూ.32 కోట్ల డెయిరీ బకాయిలను వైయస్ జగన్ ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికే ఆ నిధులను జిల్లా కలెక్టర్‌కు జమ చేసిందన్నారు. త్వరలో ఉద్యోగులకు కూడా రూ.11 కోట్ల బకాయిలు చెల్లిస్తామన్నారు. సీఎంసీలో ఆరోగ్యశ్రీ అమలుపై సీఎం వైయస్ జగన్ దృష్టికి తీసుకెళ్తామని వివరించారు. హెరిటేజ్ కోసం చిత్తూరు డెయిరీని మూసేసిన వారే డెయిరీలో స్క్రాప్‌లో గోల్‌మాల్ జరిగిందని ఆరోపించడం హాస్యాస్పదమన్నారు.

# కేంద్రమంత్రి జయశంకర్‌కు చంద్రబాబు లేఖ

అమరావతి: ఫ్లోరిడాలో చనిపోయిన అద్దంకికి చెందిన రాజేష్ కుమార్ మృతదేహాన్ని ఇంటికి పంపేందుకు సహాయం చేయాలంటూ కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి జయశంకర్‌కు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు లేఖ రాశారు. అమెరికాలోని ఫ్లోరిడా జాక్సన్‌విల్లే బీచ్‌లో అద్దంకికి చెందిన పొట్టి రాజేష్‌కుమార్ నిన్న (ఆదివారం) సముద్రంలోమునిగి చనిపోయాడు. బీచ్‌లో తన పిల్లలను రక్షించే ప్రయత్నంలో రాజేష్ ప్రాణాలు కోల్పోయాడు. భార్య, ఇద్దరు పిల్లలతో రాజేష్ కుమార్ ఫ్లోరిడాలో ఉంటున్నారు. రాజేష్ కుమార్ భౌతికకాయాన్ని స్వస్థలం తెచ్చేందుకు సహాయం చేయాలని కేంద్రమంత్రి జయ శంకర్‌ను చంద్రబాబు నాయుడు కోరారు.



## చిన్న గౌనులో ఉప్పెన పాప.. ఎన్నాళ్ళకెన్నాళ్లకు

ఉప్పెన సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన అందాల భామ కృతి శెట్టి. ఈ అమ్మడు మొదటి సినిమా బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో వెంటనే నాగ చైతన్యకి జోడీగా బంగార్రాజు సినిమాలో ఈ బ్యూటీ ఆడిపాడింది. ఈ మూవీ కూడా హిట్ కావడంతో వరుసగా అవకాశాలు వచ్చాయి. దీంతో రామ్ కి జోడీగా ది వారియర్ నితిన్ కి జోడీగా మాచర్ల నియోజకవర్గం సినిమాలలో నటించింది. ఈ రెండు సినిమాలు డిజాస్టర్ అయ్యాయి. అలాగే సుదీర్ బాబుకి జోడీగా



నటించిన ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి సినిమా కూడా ఫ్లాప్ అయ్యింది. ప్రస్తుతం నాగ చైతన్యతో కస్టడీ అనే సినిమాలో ఈ బ్యూటీ నటిస్తుంది. వెంకట్ ప్రభు దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతుంది. ఇదిలా ఉంటే వరుసగా హ్యాట్రిక్ ఫ్లాప్ సినిమాలు పడేసరికి కృతిశెట్టి సోషల్ మీడియాలో కూడా కొంత వరకు సైలెంట్ అయ్యిందని చెప్పాలి. మరల ఇప్పుడిప్పుడే యాక్టివ్ అవుతుంది. తాజాగా ఈ ఉప్పెన బ్యూటీ ఇన్స్టాగ్రామ్ లో అదిరిపోయే ఫోటోలని షేర్ చేసింది. చిన్న గౌను వేసుకొని ఢిల్లీలో గేట్ వే ఆఫ్ ఇండియా దగ్గర అలా ఆహ్లాదంగా సేదతీరుతుంది. థైస్ అందాలు కనిపించే విధంగా ఈ అమ్మడు ఫోటోలకి ఫోజులు ఇచ్చింది. క్యూట్ లుక్స్ తో కుర్రాళ్ళకి సైగలు చేస్తున్న ఈ చిన్నది స్వేచ్ఛగా ప్రకృతిని ఆశ్వాదిస్తూ ఆనందపరవశంలో తేలియాడుతుంది. దీనికి హ్యాపీ సండే అంటూ కృతి పాప క్యాప్షన్ పెట్టింది. దీనిని బట్టి ఈ అమ్మడు ఆదివారం అలా ఢిల్లీలో గేట్ వే ఆఫ్ ఇండియా దగ్గర ఎంజాయ్ చేసినట్లు తెలుస్తుంది. మొత్తానికి సినిమాలు ఆశించిన స్థాయిలో లేకపోయిన కృతి శెట్టి మాత్రం సరదాగా దొరికిన టైమ్ ని ఎంజాయ్ చేస్తుందని ఈ ఫోటోల బట్టి తెలుస్తుంది. ఇదిలా ఉంటే కస్టడీ పూర్తయిన తర్వాతనే నెక్స్ట్ సినిమా ఏదైనా కమిట్ అవ్వాలని కృతి శెట్టి ఆలోచిస్తున్నట్లుగా టాక్ వినిపిస్తుంది. కస్టడీలో ఈమె ఇంటరెస్టింగ్ రోల్ లో కనిపించబోతుంది. దీని తర్వాత సూర్యకి జోడీగా ఒక తమిళ్ సినిమాకి కూడా కృతి శెట్టి కమిట్ అయినట్లు తెలుస్తుంది.

## రితికా సింగ్ పై రుస రుసలు!

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో సినిమా ప్రెస్ మీట్ల తంతు గురించి చెప్పాల్సిన పనిలేదు. పీఆర్ ఓ ఇచ్చిన టైమ్ కి ప్రెస్ మీట్ మొదలు కాదు...పూర్తి కాదు. దీంతో మీడియా మొత్తం గంటల తరబడి వెయిట్ చేయాల్సిందే. అందులోనూ అగ్ర హీరోల సినిమాల సంగతైతే చెప్పాల్సిన పనిలేదు. కొంత మంది హీరోల ఈవెంట్లు తప్ప! చాలా వరకూ ఒక ప్రెస్ మీట్ పూర్తవ్వడానికి ఓ పూట పడుతుంది. ప్రీ రిలీజ్ ఈవెంట్లు..ఆడియో వేడుకలు.. టీజర్ లాంచ్ లు..ట్రైలర్ లాంచ్ లు సమయం పట్టడం సహజమే. కానీ కొన్ని సందర్భాల్లో సాధారణ ప్రెస్ మీట్ కి కూడా గంటలు సమయం పడుతుంది. దీనిపై ఎప్పటికప్పుడు మీడియా ప్రతినిధులు అసహనం వ్యక్తం చేసిన



సందర్భాలు చాలానే ఉన్నాయి. ఓసారి నాని సినిమా విషయంలో మీడియా కాస్త సీరియస్ గానే వ్యవహరించింది. ప్రెస్ మీట్ కి బాగా ఆలస్యంగా రావడంతో ఆ హీరో ప్రెస్ మీట్లు బ్యాన్ చేస్తున్నట్లు ప్రకటించడం జరిగింది. ఆ తర్వాత హీరో నాని క్షమాపణలు చెప్పడంతో వివాదం కొద్ది రోజులకి సద్దుమణిగింది. తాజాగా నటి రితికా సింగ్ హీరోయిన్ గా నటించిన ఇన్ కార్ ప్రెస్ మీట్ లోనూ దాదాపు అలాంటి సన్నివేశమే చోటు చేసుకుంది. రితికా సింగ్ చెప్పిన సమయానికి మీడియా సమావేశానికి అటెండ్ కావడంలో విఫలమైంది. దీంతో మీడియా ప్రతినిధులు ఆమెపై ఫైర్ అయ్యారు. మీడియా సమావేశానికి మూడు గంటలు ఆలస్యంగా వస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో ఆమె కాస్త కంగారు పడింది. ఎప్పుడు లేనింది సీన్ ఇలా రివర్స్ అయింది ఏంటని ఆందోళనకి గురైంది. వెంటనే తాను కావాలని లేటు చేయలేదని మిస్ కమ్యూనికేషన్ కారణంగా ఆలస్యం అయిందని వివరణ ఇచ్చే ప్రయత్నం చేసారు. ఆలస్యం అయినందుకు మీడియా ప్రతినిధులకు క్షమాపణలు చెప్పారు. దీంతో మీడియా సమావేశం ప్రశాంతంగా ముగిసింది. అనంతరం తమ సినిమా సమావేశాలు అనుకున్న టైమ్ లో పూర్తిచేసేలా పీఆర్ ఓలు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలా కుదరకపోతే టీమ్ అంతా అటెండ్ అయిన తర్వాత మీడియాకి పీఆర్ ఓ సమాచారం ఇవ్వాలని కోరారు. మరి మార్పు వస్తుందా? లేదా? అన్నది చూడాలి.




## పొట్టి షార్ట్ లో అనసూయ ఘాటైన వర్కౌట్స్



ఈ మధ్య కాలంలో.. సోషల్ మీడియాలో మతి పోగొట్టే పరువాలతో అనసూయ హాట్ ఫోజులు పోస్ట్ చేయడం చూస్తూనే ఉన్నాం. ఆమె పోస్ట్ పెడితే చాలు దాన్ని ట్రెండ్ ట్రోల్ చేయడానికి కొంతమంది కాసుకుని కూర్చొని ఉంటారు.

అయితే తాజాగా ఈ ముద్దుగుమ్మ మరోసారి జిమ్ లో హాట్ వర్క ఔట్లు చేసిన ఫోటోలను పోస్ట్ చేసింది. ఆ వివరాలు.. బుల్లితెరకు అనసూయ దూరమైనప్పటికీ సోషల్ మీడియాలో వెండితెరపై ఎప్పుడు ప్రేక్షకులను అలరిస్తూనే ఉంది. రంగస్థలం పుష్ప లాంటి చిత్రాలు అనసూయకి నటిగా.. మంచి పేరును తీసుకొచ్చాయి. ఆమె చివరిసారిగా రంగమార్తాండ చిత్రంలో కనిపించింది. ప్రస్తుతం పుష్ప 2 మరికొన్ని చిత్రాలతో బిజీగా ఉంది. పాత్ర నచ్చితే లేడి ఓరియెంటెడ్ చిత్రంలో నటించడానికి కూడా రెడీ గా ఉంటుంది. ఇక సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్ గా ఉండే అనసూయ.. గ్లామర్ ఆరబోతలో ఎప్పుడూ ముందుంతుంది. రీసెంట్ గా భర్తతో కలసి ఫుల్ గా థాయ్ ల్యాండ్ లో ఎంజాయ్ చేసిన అనసూయ అక్కడ దిగిన టూ పీస్ బికినీలో దిగిన హాట్ ఫొటోలను కూడా పోస్ట్ చేసింది. ఈ మధ్యనే దేశానికి తిరిగొచ్చి మళ్లీ సినిమాలపై ఫుల్ ఫోకస్ పెట్టింది. అయితే అనసూయ భరద్వాజ్ ఈ మధ్య మళ్లీ కాస్త బొద్దుగా మారింది. దీంతో సినిమాల్లో మరింత ఫిట్ గా అందంగా కనిపించడం కోసం ఎక్కువ సమయాన్ని జిమ్లోనే గడుపుతోంది. అక్కడ చెమటోడ్చి మరీ వర్కౌట్లు చేస్తూ శ్రమిస్తోంది. వీటికి సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియా పోస్ట్ చేస్తోంది. తాజాగా తన ఇన్స్టాగ్రామ్ ఖాతాలో ఓ హాట్ ఫొటోను షేర్ చేసింది. ఇందులో ఆమె పొట్టి షార్ట్ వేసుకుని నేలపై కూర్చుంది. ఈ ఫొటోలో ఆమె థైస్ బాగా హాట్ గా ఉన్నాయంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. తక్కువ సమయంలోనే ఈ పిక్ ఇంటర్నెట్లో సెన్సేషన్ గా మారింది.

## శ్రీలీల దెబ్బకి బేజారవుతున్న కృతి





టాలీవుడ్లో హీరోలు వాళ్లే ఉంటారు కానీ... హీరోయిన్లు మాత్రం ఎప్పటికప్పుడు మారిపోతూ ఉంటారు. హీరోయిన్ వచ్చి దాదాపు కొన్నేళ్లు అవుతుందంటే.. ఆమె క్రేజ్ తగ్గిపోవడం వంటివి చోటు చేసుకుంటూ ఉంటాయి. అలాంటి సమయంలో సీనియర్ భామల హడావిడి తగ్గిపోతున్న క్రమంలో ఎంట్రీ ఇచ్చిన కృతి శెట్టి మొదటి సినిమాతోనే సూపర్ హిట్ అందుకుంది. ఉప్పెన సినిమాలో బేబమ్మ పాత్రలో నటించిన ఆమె ఆ సినిమాతో సూపర్ క్రేజ్ అందుకోవడంతో ఇక ఆమె ఎక్కడికో వెళ్ళిపోతుందని అందరూ భావించారు. కానీ ఆమె అనుహ్యాంగా ఉప్పెన తర్వాత ఒక్క హిట్టు కూడా దక్కలేదు. అయితే ఈ భామకు త్వరలోనే మరిన్ని అవకాశాలు దక్కుతాయని అందరూ భావిస్తున్న తరుణంలో శ్రీలీల ఎంట్రీ ఇచ్చింది. కృతి శెట్టి ఎలా అయితే మంగళూరు నుంచి ఎంట్రీ ఇచ్చిందో... శ్రీలీల కూడా బెంగళూరు నుంచి ఎంట్రీ అయితే తెలుగు నేటివిటీ ఉన్న అమ్మాయి కావడం.. తల్లిదండ్రులు తెలుగువారు కావడంతో శ్రీలీలకు అదనపు బలం తోడైనట్లైంది. ప్రత్యేకంగా తెలుగు నేర్పాల్సిన అవసరం లేకపోవడంతో పాటుగా ఆమె చేస్తున్న సినిమాలన్నీ సూపర్ హిట్లుగా నిలుస్తుందనే పక్షంలో ఆమెకు వరుస అవకాశాలు లభిస్తున్నాయి. దీంతో కృతి శెట్టి రావాల్సిన ఆఫర్లను సైతం ఈ భామ అందుకుంటుంది. అలా వరుస అవకాశాలతో శ్రీ లీల దూసుకుపోతోంది. అలాగే కృతి శెట్టి ప్రతి విషయానికి తన తల్లిని తీసుకురావడం అన్నిట్లో ఆమెదే డామినేషన్ అవడంతో పాటు రెమ్యూనరేషన్ మీద పెట్టిన శ్రద్ధలో కొంత కూడా సినిమా పెర్ఫార్మెన్స్ మీద పెట్టడం లేదని ఆరోపణలు ఉన్నాయి. దర్శక నిర్మాతలకు కాస్త ఇబ్బందికర పరిస్థితులు ఎదురైన క్రమంలోనే ఆమెను ఇప్పుడు పక్కన పెడుతున్నారని తెలుస్తోంది. శ్రీ లీల కమర్షియల్ సినిమాలే చేసినా డాన్స్ పెర్ఫార్మెన్స్ తనదైన క్యూట్నెస్ లుక్స్ తో.. తనదైన నటనతో అందరిని ఆకట్టుకుంటూ వరుస అవకాశాలు దక్కించుకుంటూ ముందుకు వెళుతోంది. ఈ భామ పవన్ కళ్యాణ్ సినిమాతో పాటు పలు క్రేజీ ప్రాజెక్టులు దక్కించుకున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. అందులో నిజా నిజాలు ఎంతవరకు ఉన్నాయో తెలియదు. కానీ అవి నిజమైతే మాత్రం టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా నిలబడే అవకాశాలు ఎక్కువగా ఆమెకి ఉన్నాయని చెప్పొచ్చు.

## చిరుతో ఇంటరాక్షన్..శ్రీముఖికి కలిసొచ్చిందా?

శ్రీముఖి అలియాస్ బుల్లి తెర రాములమ్మ క్రేజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. చిన్న తెరపై ఎంత కాపిటీషన్ ఉన్నా రాములమ్మ ప్రత్యేకత మాత్రం వేరు. యాంకర్లందరికంటే సమ్ థింగ్ స్పెషల్ అట్రాక్షన్ అమ్మడి సొంతం. తనలో ఆ రేర్ క్వాలిటీనే మిగతా వాళ్ల నుంచి వేరు చేస్తుంది. సరైనా సినిమా ఛాన్సులు పడలేదు..లేదంటే అక్కడా చిచ్చర పిడుగులా చెలరేగేది. అయినా అంది వచ్చిన ఏ అవకాశాని విడిచిపెట్టడం లేదు. తన లో హాట్ అప్పిరియన్స్ ని సందర్భం చిక్కినప్పుడల్లా ఇన్ స్టా వేదికగా షేర్ చేస్తూనే ఉంటుంది. అలాగే నటిగానూ సత్తా చాటే ప్రయత్నాలు చేస్తుంది. ఇటీవలే నటసింహ బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తోన్న 108వ చిత్రంలో అవకాశం వచ్చిందని ప్రచారం సాగుతోంది. ఇందులో బాలయ్య కుమార్తె గా శ్రీలీల నటిస్తుండగా..ఆమె స్నేహితురాలి పాత్రకు శ్రీముఖి ఎంపికైటనట్లు తెలుస్తోంది. ఆద్యంతం ఆ పాత్ర సైతం ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా అనీల్ రావిపూడి డిజైన్ చేసినట్లు టాక్ వినిపిస్తుంది.



ఈ నేపథ్యంలో తాజాగా అమ్మడు మెగాస్టార్ చిరంజీవి సినిమాలో సైతం ఛాన్స్ అందుకుందని కొత్త ప్రచారం తెరపైకి వస్తుంది. ప్రస్తుతం చిరు కథానాయకుడిగా మోహర్ రమేష్ దర్శకత్వంలో భోళా శంకర్ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే కొద్ది భాగం షూటింగ్ కూడా పూర్తయింది. తాజాగా ఈ సినిమాలోనూ శ్రీముఖి ని కీలక పాత్రకు తీసుకున్నట్లు వినిపిస్తుంది. దీంతో శ్రీముఖి ఎంట్రీ వెనుక మెగాస్టార్ ఉన్నట్లు ఇన్ సైడ్ టాక్. చిరు సలహాతోనే శ్రీముఖి తీసుకున్నట్లు సన్నిహితుల నుంచి వినిపిస్తుంది. తొలి నటుల్లో ప్రతిభని గుర్తించి ప్రోత్సహించడంలో చిరు ముందుంటారు.

గాడ్ ఫాదర్ లో సత్యదేవ్ ప్రతి నాయకుడిగా ఛాన్స్ అందుకున్నారంటే దానికి కారణం మెగాస్టార్. సత్యదేవ్ అయితే ఆ పాత్రకు సరిగ్గా సూటవుతాడని భావించి ఎంపిక చేసారు. తాజాగా శ్రీముఖి ఎంట్రీ వెనుక అంతటి బలమైన కారణం ఉందని తెలుస్తుంది. ఆ మధ్య చిరంజీవిని సైతం శ్రీముఖి మాటల తో మెస్మరైజ్ చేసిన సంగతి తెలిసిందే. గాడ్ ఫాదర్ ప్రమోషన్ లో భాగంగా చిరుతో ఇంటరాక్ట్ అయింది. ఆ సమయంలో మెగాస్టార్ పై మాటల్లో చెప్పలేని అభిమానిన్ని కురిపించింది. చిరు సైతం అంతే ఎగ్జైట్ అయ్యారు. ఇలా అన్ని రకాలుగా శ్రీముఖికి కలిసొచ్చిందని ఇన్ సైడ్ వినిపిస్తున్న మాట.

## అదీ సంగతి: పెళ్లి గురించి ఓపెనైన లైగర్ బ్యూటీ

పూరి లైగర్ చిత్రంతో టాలీవుడ్ కి పరిచయమైంది అనన్య పాండే. కానీ ఆ సినిమా డిజాస్టర్ అవ్వడం తనను తీవ్రంగా నిరాశపరిచింది. ప్రస్తుతం బాలీవుడ్ లో పలు చిత్రాలతో బిజీగా ఉన్న అనన్య లవ్ లైఫ్ పెళ్లి ప్రణాళికల గురించి నెటిజనుల్లో డిబేట్ ఆసక్తిని కలిగిస్తోంది. అనన్య పాండే - ఆదిత్య రాయ్ కపూర్ గత సంవత్సరం కృతి సనన్ దీపావళి పార్టీలో కలిసి కనిపించినప్పుడు డేటింగ్ పుకార్లకు తెరలేచింది. ఆదిత్యతో సన్నిహితంగా ఉండే రణబీర్ కపూర్ A అక్షరంతో ప్రారంభమయ్యే ఒక అమ్మాయిని ప్రేమిస్తున్నాడని చెప్పడంతో ఆ ఇద్దరి రిలేషన్ షిప్ దాదాపుగా ఖరారైంది. అయితే ఈ డేటింగ్ పుకార్లను ఆ ఇద్దరూ ఏనాడూ అంగీకరించలేదు. కానీ ఒక ప్రముఖ వార్తా ప్రచురణ సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అనన్య ఇటీవల తన వివాహ ప్రణాళికల గురించి మాట్లాడింది. తాను పెళ్లి



చేసుకోవడానికి చాలా చిన్న వయస్సులో ఉన్నానని ప్రస్తుతం పెళ్లి గురించి ఆలోచనలు కానీ ప్రణాళికలు కానీ ఏవీ లేవని అనన్య తెలిపింది. దీంతో ఆదిత్య - అనన్య జంట డేటింగ్ వార్తలు నిరాధారమని స్పష్టత ఇచ్చినట్టయింది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. అనన్య ప్రస్తుతం తన తదుపరి చిత్రం డ్రీమ్ గర్ల్ 2 షూటింగ్ ను పూర్తి చేయడానికి ఢిల్లీలో ఉంది. ఈ చిత్రంలో ఆయుష్మాన్ ఖురానాతో కలిసి సందడి చేయనుంది. వి.ఎఫ్.ఎక్స్ ని మెరుగుపరచడానికి మేకర్స్ మరింత సమయం కావాలని భావించడంతో సినిమా వాయిదా పడింది. జోయా అక్తర్ తదుపరి నిర్మాణంలోని చిత్రం ఖో గయే హమ్ కహాన్‌లో కూడా అనన్య కనిపించనుంది. ఇందులో గెహ్రైయాన్ సహనటుడు సిద్ధాంత్ చతుర్వేది - ది వైట్ టైగర్ ఫేమ్ ఆదర్శ్ గౌరవ్ లతో కలిసి నటించనుంది. విక్రమాదిత్య మోత్వానే చిత్రం సహ కరణ్ జోహార్ నిర్మిస్తున్న కాల్ మీ బే అనే వెబ్ సిరీస్ లోను నటించనుంది.



# మైక్రోచిప్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్: కోకాపేటలో మైక్రోచిప్ టెక్నాలజీ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఇవాళ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. నాస్కామ్ ప్రకారం గత రెండేళ్లలో టెక్నాలజీ రంగంలో మూడో వంతు ఉద్యోగాలు హైదరాబాద్‌లోనే సృష్టించినట్లు తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన వాతావరణం కల్పించామని మంత్రి కేటీఆర్ అన్నారు. పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తున్నదని చెప్పారు. లైఫ్‌సైన్సెస్ రంగంలో హైదరాబాద్ గణనీయమైన అభివృద్ధి సాధించిందని తెలిపారు. దేశానికి లైఫ్ సైన్సెస్ రాజధానిగా ఉందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్ హైదరాబాద్‌లో ఉందని వెల్లడించారు. సెమీకండక్టర్ రంగంలో భారత్ తన వర్క్‌ఫోర్స్‌ను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సెమీకండక్టర్ రంగంలో భారత్ ఇప్పుడిప్పుడే వృద్ధి చెందుతోందన్నారు. వచ్చే దశాబ్దంలో ఆ రంగంలో భారత్ దూసుకెళ్తుందన్న విశ్వాసాన్ని మంత్రి వ్యక్తం చేశారు. ఆ ప్రక్రియలో హైదరాబాద్ నగరం కీలక పాత్ర పోషించనున్నట్లు మంత్రి వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం వెయ్యి మందికి స్వంత ఖర్చులతో శిక్షణ ఇస్తోందన్నారు. ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కిలింగ్ రంగంలో కూడా తెలంగాణ అగ్రగామిగా కొనసాగుతోందన్నారు.




## అజిత్ రాకతో శిందే స్థానం గల్లంతే: ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన సామ్నా

ముంబయి: మహారాష్ట్ర రాజకీయాల్లో అత్యంత కీలక పరిణామాలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. అజిత్ పవార్ తన బాబాయి శరద్ పవార్ పార్టీ ఎన్‌సీపీని నిట్టనిలువునా చీల్చి.. తన మద్దతుదారులతో కలిసి భాజపాలో చేరారు. ఆ వెంటనే మహా సంకీర్ణ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. దీనిపై శివసేనకు చెందిన సామ్నా తన సంపాదకీయంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. 'ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ.. మహారాష్ట్రతో పాటు దేశ రాజకీయాలను మురికిగా మార్చేసింది. రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందేను అజిత్ పవార్ భర్తీ చేస్తారు. ఉప ముఖ్యమంత్రి పదవి కోసం పవార్ ఈ కూటమితో కలిశారనుకోవడం లేదు. శిందే, ఆయన మద్దతుదారులపై త్వరలో అనర్హత వేటు పడుతుంది. పవార్‌కు పట్టాభిషేకం చేస్తారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలను రాష్ట్ర ప్రజలు అంగీకరించరు. రాష్ట్రంలో ఇదివరకు ఇలాంటి సంప్రదాయం లేదు. ప్రజలు ఇలాంటి వాటికి మద్దతు ఇవ్వరు' అని ఆగ్రహం వ్యక్తం చేసింది. తాము శివసేనను వీడటానికి ఎన్‌సీపీనే కారణమంటూ ఉద్ధవ్ ఠాక్రేను విమర్శిస్తూ శిందే వర్గం భాజపాతో కలిసింది. మరిప్పుడు ఆ పవార్ కూడా అక్కడికే వచ్చారు. ఇప్పుడు శిందే ఏం చేస్తారు..? ప్రమాణ స్వీకార సమయంలో శిందే వర్గం నేతల మొహంలో హావభావాలు.. వారి భవిష్యత్తు అంధకారమైందని స్పష్టం చేశాయి. వారు ప్రచారం చేసుకున్న హిందుత్వ ముగిసిపోయింది' అని సామ్నా తీవ్ర విమర్శలు గుప్పించింది. అలాగే ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం విషయంలో అజిత్ రికార్డు సృష్టించారని ఎద్దేవా చేసింది. 2019 అసెంబ్లీ ఎన్నికలు జరిగిన దగ్గరి నుంచి ఆయన మూడుసార్లు ఆ పదవికి ప్రమాణం చేశారు.

# రాసిచ్చిన స్క్రిప్ట్ తో రాహుల్ స్కిట్..



హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీపై మంత్రి హరీష్ రావు ఫైర్ అయ్యారు. ఖమ్మం సభలో రాహుల్ చేసిన కామెంట్స్‌కు ట్విట్టర్ వేదికగా కౌంటర్ ఇచ్చారు. దేశాన్ని దోచుకున్న చరిత్ర మీది అంటూ రాహుల్‌పై ఫైర్ అయ్యారు. మీ పార్టీ అవినీతికి మారుపేరుగా మారిందన్నారు. అందుకే మీ పార్టీ పేరే స్కాంగ్రెస్‌గా మారిందన్నారు. అందుకే దేశ ప్రజలు మిమ్మల్ని అధికారం నుంచి దించి మూలన కూర్చోబెట్టారని హరీష్ రావు విమర్శించారు. "బీఆర్ఎస్ ఎవరికీ బీ టీం కాదు.. మాది పేద ప్రజలకు ఏ టీం. ప్రజల సంక్షేమం చూసే ఏ క్లాస్ టీం.

బీజేపీని ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్‌కు లేదు. అందుకే దేశాన్ని బీజేపీ కబంద హస్తాల నుంచి కాపాడేందుకే బీఆర్ఎస్ పుట్టింది. రాష్ట్రంలో పోడు పట్టాల పంపిణీ కళ్లకు కనిపించలేదా..? మేం పట్టాలు పంచినంక మళ్లీ మీరిచ్చేదేంది? అప్‌డేట్ తెలుసుకోని ఔట్ డేటెడ్ పొలిటీషియన్ రాహుల్ గాంధీ. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం ఖర్చు మొత్తం 80,321.57 కోట్లు. అయితే, అవినీతి లక్ష కోట్లు అని అనడం పెద్ద జోక్. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం ఖర్చు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది అని, కేంద్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడ ఇవ్వలేదని మీ పార్టీ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రం సమాధానం ఇచ్చిన విషయం తెలియదా? స్కీమ్‌ల్లోని స్కాంల్లో ఆరితేరిన కాంగ్రెస్ కుంభకోణాల గురించి మాట్లాడడం.. దెయ్యాలు వేదాలు వల్లించడమే. అప్పుడే ముదిగొండ కాల్పులను మరిచిపోయారా? భూములు అడిగితే జైల్లో వేసిన వాళ్ళు, కరెంట్ అడుగుతే పిట్టల్లా కాల్చి చంపినోళ్లు ఖమ్మంలో కల్లిబొల్లి కబుర్లు చెప్తే నమ్మే వాళ్ళు ఎవరు లేరు.

ఖమ్మం సభ ఒక్క ముక్కలో చెప్పాలంటే.. పసలేని ఆరోపణలు, ఊకదంపుడు ప్రసంగాలు.. రాసిచ్చిన స్క్రిప్ట్ తో రాహుల్ స్కిట్.." అంటూ హరీష్‌రావు దుయ్యబట్టారు.

# కేసీఆర్ అవినీతిని వెలికి తీసి బోనులో నిలబెడతాం



హైదరాబాద్: ఖమ్మం సభపై బీఆర్ఎస్ నాయకులు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. పింఛన్ రూ.4 వేలు ఇస్తామని ప్రకటిస్తే... దానిపై కూడా విమర్శలు చేస్తున్నారన్నారు. నిరుపేద వర్గాలను దృష్టిలో పెట్టుకొని ఈ పథకం ప్రకటించామని తెలిపారు. రూ.4 వేలు ఇస్తామని చెబితే తప్పేముందని ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాల్లో ఎందుకు కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇవ్వడం లేదని అనడం ఏంటీ అంటూ మండిపడ్డారు. ఏ ప్రభుత్వాలు అయినా అక్కడి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పథకాలు అమలు చేస్తారని... ఆ మాత్రం అవగాహన లేకుంటే ఎలా అని నిలదీశారు. రాహుల్ గాంధీ ఎవరు అనడం సరికాదని.. ఆ మాటలు మాట్లాడే వారి స్థాయి ఏంటి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అంటే బీజేపీ రిస్తేదార్ సమితి అనడంలో తప్పులేదని వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి ప్రధాని వస్తే రాష్ట్రానికి కావాల్సిన అంశాలు అడగాలని.. కానీ కేసీఆర్ తమకు ఏమీ వద్దు... మీ ప్రేమ చాలు అని ఎలా అంటారని ప్రశ్నించారు. అమిత్ షా ముందు కేటీఆర్ మోకరిల్లారని... ఇది నిజం కాదా అని నిలదీశారు. కవితని లిక్కర్ కేసు నుంచి మినహాయింపు నిజం కాదా అని అడిగారు. దేశంలో ఏ సిద్ధాంతం లేని పార్టీ బీఆర్ఎస్ మాత్రమే అని విమర్శించారు. ఉద్యమ ఆకాంక్షలు నెరవేరుస్తామంటే తప్పేముందని అన్నారు. రాష్ట్రంలో బీసీలకు కేసీఆర్ సర్కార్ చేసింది ఏమీ లేదని... ఖమ్మం సభ రాబోయే ఎన్నికల్లో విజయానికి నాంది అని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 80 స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తంచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కేసీఆర్ అవినీతిని వెలికి తీసి బోనులో నిలబెడతామని జీవన్ రెడ్డి హెచ్చరించారు.

# మా కార్యకర్తలు తలుచుకుంటే కోమటిరెడ్డి బయట తిరగలేరు: తాతా మధు



ఖమ్మం: కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహించిన 'తెలంగాణ జనగర్జన' బహిరంగ సభ అట్టర్ ఫ్లాప్ అయ్యిందని భారాస ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ అన్నారు. అది జనగర్జన కాదని.. నాయకుల గర్జనేనని ఎద్దేవా చేశారు. ఖమ్మంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్, భారాసపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన విమర్శలపై మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రజలకు ఏం చేస్తారో చెప్పలేక కేసీఆర్‌పై రాహుల్‌గాంధీ విమర్శలు చేశారు.

ఎంపీ కోమటిరెడ్డి భారాసపై అవాకులు చవాకులు పేలుతున్నారు. భారాస కార్యకర్తలు తలుచుకుంటే కోమటిరెడ్డి బయట తిరగలేరు. భారాస ఏ పార్టీకీ బీటీమ్ కాదు.. సీటీమ్ కాదు. కాంగ్రెస్ నేతలు వాస్తవాలను కప్పి ఉంచే ప్రయత్నాలు చేస్తున్నారు. జోడో యాత్ర ద్వారా మంచి గుర్తింపు వచ్చిందని రాహుల్ అన్నారు. మరి గుజరాత్‌లో జోడోయాత్ర ఎందుకు చేయలేదు?" అని మధు ప్రశ్నించారు.




హైదరాబాద్: గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఉస్మానియా ఆసుపత్రిని పరిశీలించారు. ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ శశికళ గవర్నర్‌కు స్వాగతం పలికారు. అనంతరం ఆస్పత్రి పరిసరాలను, పాత భవనాన్ని ఆమె పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమిళిసై మాట్లాడుతూ.. ఉస్మానియా ఆసుపత్రి విషయంలో చొరవ చూపిన కోర్టును అభినందిస్తున్నట్లు చెప్పారు. " ఆసుపత్రిలోని టాయిలెట్లు పరిశీలించా.. పరిస్థితి దారుణంగా ఉంది. రోజుకు 2వేల మంది ఔట్ పేషెంట్లు వస్తున్నారు. ఆసుపత్రి పైకప్పు పెచ్చులు ఊడి రోగులు బాధపడుతున్నారు. రోజుకు 200 వరకు సర్జరీలు చేస్తున్నారు. ఉస్మానియా ఆసుపత్రి భవనం కట్టి వందల ఏళ్లవుతోంది. జనరల్ వార్డులో కొన్ని ఫ్యాన్లు మాత్రమే పనిచేస్తున్నాయి. ఎండ వేడి తట్టుకోలేకపోతున్నామని రోగులు వాపోతున్నారు. కొత్త భవనం కట్టాల్సిన అవసరం ఉంది. నేను ఎవరినీ తప్పుబట్టేందుకు ఉస్మానియా ఆసుపత్రికి రాలేదు" అని తమిళిసై అన్నారు. ఇటీవల ఉస్మానియా ఆసుపత్రి నూతన భవన నిర్మాణం చేపట్టాలని కోరుతూ గవర్నర్ ట్విటర్‌లో పేర్కొన్న సంగతి తెలిసిందే. ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణానికి సంబంధించి గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలుపుకోవాలంటూ 'జస్టిస్ ఫర్ ఓజీహెచ్' చేసిన ట్వీట్‌ను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ రీట్వీట్ చేస్తూ ఆస్పత్రి దుస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతో మందికి అత్యంత మెరుగైన వైద్య సేవలు అందించిన చరిత్ర ఉస్మానియా ఆస్పత్రికి ఉందన్నారు. ఆస్పత్రి నూతన భవన నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలని ఆమె రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉస్మానియా దుస్థితి చూడటం బాధాకరమని ఆమె అన్నారు. గవర్నర్ వ్యాఖ్యలపై ఇటీవల మంత్రి హరీశ్‌రావు కూడా ఘాటుగా స్పందించారు. ఈ నేపథ్యంలో గవర్నర్ పర్యటన కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఆ ప్రసంగం చూస్తే రాహుల్‌ను పప్పు అనడంలో తప్పే లేదు



హైదరాబాద్: ఖమ్మం సభలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రసంగం చూస్తే ఆయనను పప్పు అనడంలో తప్పు లేదు అనిపించిందని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఇక్కడి సన్నాసులు ఏది రాసిస్తే అది చదివి వినిపించి వెళ్లారన్నారు. రాహుల్ గాంధీ రిమోట్ గాంధీగా మారిపోయారని ఎద్దేవా చేశారు. జాతీయ నాయకులకు ఏ రాష్ట్రాల్లో ఏం జరుగుతుందో అవగాహన ఉండాలని హితవుపలికారు. తెలంగాణ కంటే గొప్పగా ఏ రాష్ట్రంలో ఏం ఉందో చెబితే బాగుండేదన్నారు. కాంగ్రెస్ పాలనలో ఏం జరిగిందని... రైతు బంధు, భీమా, 2 వేల పెన్షన్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఈ పథకాలు ఎందుకు లేవని అడిగారు. కాంగ్రెస్ పాలించే రాష్ట్రాల్లో రూ.4వేల పెన్షన్ ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. అక్కడ ఇవ్వకుండా ఇక్కడ ఇస్తం అంటే ప్రజలు నమ్ముతారా? అని మంత్రి అన్నారు. జాతీయ పార్టీగా కాంగ్రెస్‌కు జాతీయ విధానం ఉండాలన్నారు. అన్ని రాష్ట్రాల్లో రూ.4వేలు పెన్షన్ ఇస్తామని చెప్పే దమ్ముందా అంటూ ప్రశ్నలు కురిపించారు. కాళేశ్వరం ప్రపంచంలోనే పేరెన్నికగన్న ప్రాజెక్ట్ అని దానికి ఖర్చు అయిందే రూ.80 వేల కోట్లు అయితే లక్ష కోట్ల అవినీతి ఎలా జరుగుతుందని అన్నారు. రాహుల్ సోయి లేకుండా మాట్లాడారని మండిపడ్డారు. స్కాంలకు రారాజులు మీ కాంగ్రెస్ నేతలంటూ వ్యాఖ్యలు చేశారు.

స్కాంలో ఇరుక్కుని ప్రజల చేత తిరస్కరించబడ్డ నేత మీ తండ్రి రాజీవ్ గాంధీ అంటూ దుయ్యబట్టారు. అసలు ఏ హోదాలో రాహుల్ కాంగ్రెస్ విధానాలు ప్రకటించారని అడిగారు. అసలు రాహుల్‌కు కాంగ్రెస్‌లో ఏ హోదా ఉందని.. రాహుల్ ఒక రాజుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్‌కు సమాన దూరం ఉంటామని సీఎం కేసీఆర్ ముందే ప్రకటించారని గుర్తు చేశారు. తాము ఎవరికీ ఏ టీమ్ కాదు, బీ టీమ్ కాదన్నారు. ఇక్కడి కాంగ్రెస్ నేతలే బీజేపీకి ఏ టీమ్ బీ టీమ్ గా మారారని తెలిపారు. ఈటెల రాజేందర్, రేవంత్ రెడ్డి హోటల్స్‌లో కలుసుకున్నారని.. కావాలంటే ఫోటోలు పంపిస్తామని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు.

# బండి సంజయ్‌కు ఢిల్లీ నుంచి పిలుపొస్తుందా?



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర భాజపా అధ్యక్షుడు బండి సంజయ్‌కు అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చే అవకాశముందని ఆ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గత కొద్దిరోజులుగా రాష్ట్ర భాజపా అధ్యక్షుడి మార్పు జరగనుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో సంజయ్‌కు కేంద్రమంత్రి పదవి ఇచ్చే అవకాశముందనే ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర అధ్యక్ష పదవికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం హనుమకొండలో సంజయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మోదీ సభకు అధ్యక్షుడి హోదాలో వస్తానో.. లేదో తెలియదు. హైకమాండ్ నిర్ణయమే శిరోధార్యం. మోదీ సభను విజయవంతం చేయాలి" అని కార్యకర్తలతో ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలతో సంజయ్‌కు ఢిల్లీ నుంచి పిలుపు రావొచ్చనే ఊహాగానాలకు మరింత బలం చేకూరుతోంది.

**ముంబయి వెళ్లిన సంజయ్ :** బండి సంజయ్ నేడు ముంబయి పర్యటనకు వెళ్లారు. అక్కడి ముంబ మహాదేవి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భాజపా అధిష్ఠానం నుంచి సాయంత్రంలోపు సంజయ్‌కు పిలుపు రావొచ్చని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పిలుపు వస్తే సంజయ్ ముంబయి నుంచే నేరుగా ఢిల్లీ వెళ్లే అవకాశముంది.

**జితేందర్‌రెడ్డిని కలవనున్న ఈటల :** మరోవైపు మాజీ ఎంపీ, భాజపా నేత జితేందర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ వెళ్లనున్నారు. గత కొంతకాలంగా వీరిద్దరి మధ్య విభేదాలు కొనసాగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర అధ్యక్షుడిగా సంజయ్‌ను కొనసాగించాలని జితేందర్‌రెడ్డి వర్గం కోరుతోంది. ఈ నేపథ్యంలో ఆయన్ను కలిసేందుకు ఈటల వెళుతుండటం ఆసక్తికరంగా మారింది.

# యువరాజు ఊహాలోకంలో విహరిస్తున్నారు.. రాహుల్‌పై కిషన్‌రెడ్డి విసుర్లు



ఢిల్లీ: ఖమ్మం సభలో రాహుల్ గాంధీ ఉపన్యాసం విని ప్రజలు నవ్వుకుంటున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. యువరాజు ఊహాలోకంలో విహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణాలో బీజేపీకి భవిష్యత్తులేదని రాహుల్ గాంధీ తేల్చారని.. కానీ తేల్చాల్సింది అసమర్థుడైన రాహుల్ గాంధీ కాదు.. తెలంగాణ ప్రజలు అని చెప్పుకొచ్చారు. నాలుగు నెలలు ఆగితే ప్రజలే తేలుస్తారన్నారు. 19 మంది ఎమ్మెల్యేలను గెలిపిస్తే రాహుల్ గాంధీపై నమ్మకం లేక 12 మంది ఎమ్మెల్యేలు పార్టీ వీడి బీఆర్ఎస్ గూటికి చేరారని తెలిపారు. సొంతపార్టీ ఎమ్మెల్యేలను కాపాడుకోలేని రాహుల్ గాంధీ పగటికలలు కంటున్నారని వ్యాఖ్యలు చేశారు. బీజేపీ బీ టీం అనడం రాహుల్ గాంధీ మిడిమిడి జ్ఞానంతో అవగాహనాలేమీతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య లోపాయికారి ఒప్పందం జరిగిందని ఆరోపించారు. పార్లమెంట్‌లో కూడా కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి పనిచేసాయని అన్నారు. రాష్ట్రపతి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి కేసీఆర్ ఊరేగింపు చేసి సన్మానం చేసిన విషయాన్ని ఎవరూ మర్చిపోలేదన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగాలేనంటూ పారిపోయిన వ్యక్తి రాహుల్ గాంధీ అంటూ దుయ్యబట్టారు. అధ్యక్షుడిగా ఘోరంగా విఫలమైన వ్యక్తి అయినా రాహుల్ గాంధీకి బీజేపీని విమర్శించే హక్కు లేదన్నారు. ఎవరు ఎవరికి బీ టీమో అందరికి తెలుసని అన్నారు. కేసీఆర్‌ను అఖిలేష్ యాదవ్ కలిసేందుకు హైదరాబాద్ వచ్చారని అన్నారు. గతనెలలో విపక్షాల సమావేశంలో పాల్గొన్న అఖిలేష్ యాదవ్ ఇప్పుడు కేసీఆర్‌ను కలవడంతోనే వాళ్ళ బంధమేంటో అర్థమౌతుందన్నారు. కేసీఆర్ కాంగ్రెస్‌లోనే నాయకుడిగా ఎదిగారని గుర్తుచేశారు. ఇద్దరి డీఎన్ఏ ఒక్కటే, రెండూ కుటుంబ పార్టీలే అని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ఎంత దూరమో బీఆర్ఎస్ అంతే దూరమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌తో ఎప్పుడు కలిసి పనిచేయలేదని.. భవిష్యత్‌లో కలిసి పనిచేయమని తేల్చిచెప్పారు. మజ్లిస్‌ను పెంచి పోషించిన చరిత్ర కాంగ్రెస్ ది అయితే, ఊరేగిస్తున్న చరిత్ర బీఆర్ఎస్ ది అని వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ కుటుంబ రాజకీయాలపై మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి ఎలా వచ్చారు? వారి కుటుంబ పెద్దల అండదండలతోనే కదా అని అన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ కంటే ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ దేశానికి ప్రమాదామని మాజీ ప్రధాని అటల్ బిహార్ వాజ్పాయ్ చెప్పుండేవారన్నారు. అధికారం కోసం దేనికైనా దిగజారే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. ప్రధాని పదవిని కాపాడుకోవడం కోసం ప్రజాస్వామ్యాన్ని హత్య చేసే కాంగ్రెస్ పార్టీకి బీజేపీని విమర్శించే నైతిక హక్కులేదన్నారు.

# రాహుల్ లీడర్ కాదు రీడర్: మంత్రి జగదీశ్ రెడ్డి

సూర్యాపేట: మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ లీడర్ కాదని రీడరని మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. రెండుసార్లు ఏఐసీసీ అధ్యక్ష పదవిని అర్ధాంతరంగా వదిలి పెట్టారని విమర్శించారు. రాసిచ్చింది చదవడమే ఆయన చేస్తున్న పనని ఎద్దేవా చేశారు. నిన్నా, మొన్నా గల్లీ లీడర్లు మాట్లాడిన మాటలనే రాహుల్ ఉటంకించారని చెప్పారు. సూర్యాపేటలో మంత్రి జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీకి బీఆర్ఎస్ రిశ్తేదార్ కాదని, రాహులే మోదీకి గుత్తేదారన్నారు. రూ.4 వేల పింఛన్ ఇస్తామని ఏ హోదాలో ప్రకటించారని నిలదీశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో ఇస్తున్న ఫించన్ ఎంత అని ప్రశ్నించారు. పింఛన్ ప్ల కార్డులు రాహులు తెలిసే పట్టుకున్నారా అని ఆగ్రహం వ్యక్తంచేశారు. రూ.4 వేల పెన్షన్ ఇచ్చేది నిజమే అయితే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో ఎందుకు ఇవ్వడం లేదరన్నారు. కాంగ్రెస్ పార్టీని కొనఊపిరితో బతికిస్తున్న ఛత్తీస్‌గఢ్‌లో వృద్ధులకు ఇస్తున్నది రూ.350లేనని చెప్పారు. అదే రాష్ట్రంలో వికలాంగులకు రూ.500, వితంతువులకు రూ.350 ఇస్తున్నారని తెలిపారు. అదే పార్టీ ఎలుబడిలో ఉన్న రాజస్థాన్లోనూ వృద్ధులకు రూ.750, వికలాంగులకు రూ.750, వితంతువులకు రూ.550 మాత్రమేనని వెల్లడించారు. సచ్చిపోతుందనుకున్న కాంగ్రెస్ పార్టీకి జీవం పోసిన కర్ణాటకలోనూ ఇచ్చేది అంతకంటే ఎక్కువ లేదన్నారు. అందుకే ఆయనను లీడర్‌గా కాకుండా రీడర్‌గానే చూడాల్సి వస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో ఇవ్వని ఫించన్లు తెలంగాణా లో ఇస్తామని ప్రకటించడానికి సిగ్గుఉండాలన్నారు. రూ.4 వేల పింఛన్ ప్రకటన ఇక్కడి ప్రజలకు నమ్మ శక్యంగా లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికే ముఖ్యమంత్రి కేసీఆర్ దివ్యాంగులకు రూ.4,000, వితంతువులు, వృద్ధులకు రూ.2016 ఇస్తున్నారని గుర్తుచేశారు. కాళేశ్వరం కట్టిందే లక్ష కోట్లతోనని, కట్టిన మొత్తంలో స్కామ్ జరిగిందంటూ ఆరోపణలు చేయడం రాహుల్ అజ్ఞానాన్ని బయట పడేసిందని చెప్పారు. కాళేశ్వరం కట్టింది నిజమో కాదో తెలియడానికి రాహుల్ మెడిగడ్డ మీద నుండి దూకితే తెలుస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com